www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 7 సెప్టెంబరు 2023

5

ఏలూరు

టిటిడి సభ్యులు మేకా శేషుబాబుకు ఘనస్వాగతం

మేకా శేషుబాబుకు స్వాగతం పలుకుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు, పాలకొల్లు రూరల్

టిటిడి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత తొలిసారిగా పాలకొల్లు వచ్చిన మేకా శేషుబాబుకు ఘనస్వాగతం లభించింది. పూలపల్లి వై.జంక్షన్ నుంచి భారీ మోటార్ సైకిళ్లపై ఆయన అనుయాయులు, వైసిపి కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ఆయనకు ప్రజలు, వ్యాపారులు బ్రహ్మరథం పట్టారు. ఆయనతో పాటు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు, కార్పొరేషన్ ఛైర్మన్ వీరన్న, గుబ్బల రామకృష్ణ పాల్గొన్నారు.

హైటెన్షన్

కాళ్ల మండలం ఏలూరుపాడు వద్ద యువగళం వాలంటీర్లను తరలిస్తున్న పోలీసు వాహనాలను అడ్డుకున్న టిడిపి నేతలు

- లోకేష్‌కు పోలీసులు నోటీసుల జారీ
- తీసుకునేందుకు లోకేష్ నిరాకరణ
- నోటీసు తీసుకున్న పాలకొల్లు ఎంఎల్ఎ రామానాయుడు
- యువగళం క్యాంపు సైట్లో అర్ధరాత్రి పోలీసులు హల్‌చల్
- 50 మంది వాలంటీర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 44 మంది యువగళం వాలంటీర్లు, 13 మంది టిడిపి నేతలపై కేసుల నమోదు
- పోలీసుల తీరుపై టిడిపి నేతల ఆగ్రహం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పరిసర ప్రాంతాల్లో బుధవారం హైటెన్షన్ నెలకొంది. మంగళవారం రాత్రి భీమవరం శివార్లలో తాడేరు టౌన్‌షిప్ వద్ద టిడిపి, వైసిపి పరస్పర దాడితో పరిస్థితులు ఉద్రిక్తతకు దారితీశాయి. మంగళవారం అర్ధరాత్రి పోలీసులు పెద్దసంఖ్యలో యువగళం క్యాంపు సైటుకు చేరుకుని సుమారు 50 మంది వాలంటీర్లను అదుపులోకి తీసుకున్నారు. దీంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకే లోకేష్ పాదయాత్ర ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ బాగా ఆలస్యమైంది. పాదయాత్ర ప్రారంభించేందుకు బస శిబిరం నుంచి లోకేష్ బయటకు రాగానే పోలీసులు అడ్డుకున్నారు. భీమవరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతోపాటు ముఖ్యమంత్రి జగన్, స్థానిక ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌పై రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారని, పాదయాత్ర కాన్వాయ్‌లో ఎక్కువ వాహనాలు ఉన్నాయని, రాత్రి సమయం దాటినా పాదయాత్ర జరిగిందనే అంశాలపై వివరణివ్వాలని భీమవరం రూరల్ సిఐ నాగప్రసాద్ లోకేష్‌కు, టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మికి నోటీసులిచ్చే ప్రయత్నం చేశారు. దీనిపై లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులపై ప్రశ్నల వర్షం కురిపించారు. శాంతిభద్రతలకు వైసిపి మూకలు విఘాతం కలిగించలేదా అని లోకేష్ నిలదీశారు. నాకు ఇస్తున్న నోటీసులు వైసిపి వాళ్లకు ఇచ్చారా అని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని వదిలేసి బాధితులుగా ఉన్న తమకు నోటీసులు జారీ చేయడం సరికాదని లోకేష్ నోటీసు తీసుకునేందుకు నిరాకరించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ క్రమంలో లోకేష్, సీతారామలక్ష్మి తరపున ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు భీమవరం రూరల్ సిఐ నాగప్రసాద్ నుంచి నోటీసులు అందుకున్నారు. అనంతరం పాదయాత్ర ముందుకు సాగింది. ఉదయం 8 గంటలకు భీమవరం రూరల్ మండలం కె.బేతపూడి క్యాంపు నుంచి ప్రారంభం కావాల్సిన పాదయాత్ర ఉత్కంఠ పరిణామాల మధ్య 11.30కు ప్రారంభమైంది. పాదయాత్రకు దారిపొడవునా ఘనస్వాగతం లభించింది. పెదగరువు మీదుగా వెంప మెయిన్ సెంటర్ వరకూ సాగిన పాదయాత్ర భోజన విరామం తర్వాత లోకేష్ క్షత్రియ సామాజిక తరగతి ప్రతినిధులతో సమావేశమయ్యారు.

2800 కిలోమీటర్ల మైలురాయి శిలాఫలకం ఆవిష్కరణ

లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టి 206 రోజుల్లో 2,800 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వెంప సెంటర్లో 2800 కిలోమీటర్ల మైలురాయి శిలాఫలకాన్ని లోకేష్ ఆవిష్కరించారు. అక్కడ నుంచి సాగిన పాదయాత్ర నరసాపురం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. శేరేపాలెంలో స్థానికులతో మాట్లాడారు. నక్కవారిపాలెంలో ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన వారితో లోకేష్ సమావేశమయ్యారు. ఎన్‌టిఆర్ గొల్లగూడెంలో స్థానికులతో మాట్లాడి మొగల్తూరు గాంధీ సెంటర్ మీదుగా స్మార్ట్ పాయింట్‌కు చేరుకుని కాపు సామాజిక తరగతికి చెందిన వారితో లోకేష్ భేటీ అయ్యారు. అక్కడి నుంచి యాత్ర మొగల్తూరు అంబేద్కర్ విగ్రహం సెంటర్ మీదుగా సీతారామపురంలోని విడిది కేంద్రం వరకూ సాగింది.

పాదయాత్రలో నారా లోకేష్

సభలో మాట్లాడుతున్న లోకేష్

పేద క్షత్రియులకు చేయూతనిస్తాం : లోకేష్

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి అధికారంలోకి వచ్చిన 100 రోజులలో క్షత్రియుల అభివద్ధికి నిధులు కేటాయించి పేద క్షత్రియులు చేయూతనిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. బోగాపురం ఎయిర్పోర్ట్ కు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు నామకరణం చేస్తామని హామీ ఇచ్చారు. యువ గళం పాదయాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గం వెంప గ్రామంలో ఏర్పాటు చేసిన క్షత్రియ సామాజిక తరగతి ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. లోకేష్ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్షత్రియులు అనేక సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. తమలోనూ పేదలున్నారని, కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆదుకోవాలని కోరారు. చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు తన 1800 ఎకరాలను విద్యాసంస్థలకు దానం చేశారని గుర్తు చేశారు. ఆయన మరణానంతరం తగిన గౌరవం ప్రభుత్వాల నుంచి దక్కలేదన్నారు. ఆయన పేరున స్మారక భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఆక్వాకు సంబంధించిన స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు రాయితీలు, ప్రోత్సాహం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన లోకేష్ మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే పేద క్షత్రియులకు చేయూతనందిస్తామన్నారు, భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెడతామని, అమరావతిలో అల్లూరి మెమోరియల్ ఏర్పాటుచేస్తామని, పార్లమెంటులో కూడా అల్లూరి విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మూర్తిరాజు స్వగ్రామంలో మూర్తిరాజు విగ్రహం, స్మారక భవనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎపిని సైకో జగన్ మరో బీహార్‌గా మార్చేశారని విమర్శించారు. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజును ఏం చేశారో మీకు తెలుసని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎంఎల్‌సి పాందువ్వ శ్రీను, జెడ్‌పి మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు పాల్గొన్నారు.

కందిపప్పు కనుమరుగు..!

కుచించుకుపోయిన రేషన్ సరుకులు

ఈ నెల బియ్యం, పంచదారతో సరి

దాదాపు తొమ్మిది సరుకుల నుంచి రెండుకు కుదింపు

వంటనూనె, శనగలు వంటి వాటికీ తిలోదకాలు

బహిరంగ మార్కెట్లో మండిపోతున్న నిత్యావసరాల ధరలు

లబోదిబోమంటున్న సామాన్య ప్రజానీకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే సరుకులన్నీ రోజురోజుకీ తగ్గిపోతున్నాయి. కందిపప్పు దాదాపు కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొంది. సెప్టెంబర్‌లో అందించే రేషన్ సరుకుల్లో బియ్యం, పంచదారతో సరిపెట్టేశారు. ఒకప్పుడు తొమ్మిది నుంచి పది సరుకులు రేషన్ దుకాణాల్లో అందించేవారు. ఇప్పుడు బియ్యం మాత్రమే నికరంగా ఇస్తున్నారు. కొన్ని నెలలు మాత్రమే పంచదార వంటివి అందిస్తున్నారు. ఒకపక్క పెరిగిన ధరలు, మరోపక్క రేషన్ సరుకుల్లో కోతతో సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 11 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. రేషన్ బియ్యం, సరుకులపై ఆధారపడి జీవించే కుటుంబాలు అత్యధికంగానే ఉన్నాయి. రాష్ట్ర విభజనకు ముందు రేషన్ దుకాణాల్లో తొమ్మిది సరుకులు ఒక సంచిలో పెట్టి అందించేవారు. బియ్యం, వంటనూనె, గోధుమలు, కందిపప్పు, పంచదార, శనగపప్పు, కిరోసిన్, ఎండుమిర్చి వంటివి సైతం ఇచ్చేవారు. 2014 తర్వాత వంటనూనె, బియ్యం, పంచదార, గోధుమలు వంటి కొన్ని సరుకులు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నికరంగా బియ్యం మాత్రమే ఇస్తున్నారు. మరికొన్ని నెలలు పంచదార ఇస్తున్నారు. కందిపప్పు ఎప్పుడో గుర్తొచ్చినప్పుడు అన్నట్లు పరిస్థితి తయారైంది. అప్పుడప్పుడు ఇచ్చినా అవి కూడా సరైన నాణ్యత లేని పరిస్థితి ఉంది. బహిరంగ మార్కెట్లో వంటనూనె ధర రూ.150కుపైనే పలుకుతోంది. కందిపప్పు ధర పరిస్థితి అదేవిధంగా ఉంది. నిత్యావసర వస్తువుల ధరలన్నీ ఆకాశాన్నంటాయి. కరోనా తర్వాత సామాన్య ప్రజానీకం ఆర్థిక పరిస్థితి తారుమారైంది. వ్యవసాయ కూలీలకు పనులు లేకుండాపోయాయి. చిరుద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యునికి అందనంత ఎత్తుకు ఎగబాకాయి. లీటర్ పెట్రోల్ రూ.115కు చేరింది. డీజిల్ సెంచరీ కొట్టింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో హోటళ్లలో టిఫిన్ ధర రూ.40కు భోజనం ఖరీదు రూ.వంద నుంచి రూ.120కి చేరింది. ఇటువంటి పరిస్థితుల్లో పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు దాటవేత ధోరణికి దిగాయి. సబ్సిడీపై రేషన్ సరుకులు అందించి ఆదుకోకపోగా.. ఉన్నవి సైతం ఎగ్గొడుతున్న పరిస్థితి నెలకొంది. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కొనుగోలు చేయాలంటే రూ.130కుపైనే ఉంది. సబ్సిడీపై రేషన్ ద్వారా అందించే కందిపప్పు ఇవ్వకపోవడంతో సామాన్య ప్రజానీకం బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేషన్ సరుకుల కుదింపుపై తీవ్ర విమర్శలు గుప్పించిన వైసిపి అధికారంలోకొచ్చాక మరింత కుదించిన పరిస్థితి నెలకొందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటింటికీ రేషన్ అందించేందుకు రెండు జిల్లాల్లోనూ 750 వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బియ్యం, పంచదార ఇవ్వడానికి ఇంత పెద్దమొత్తంలో ఖర్చు పెట్టి వాహనాలు ఏర్పాటు చేయడం ఎందుకనే విమర్శలు విన్పిస్తున్నాయి. రేషన్ దుకాణల్లో సబ్సిడీపై గతంలో మాదిరిగా సరుకులు అందించాలని సామాన్య ప్రజానీకం కోరుతున్నారు. ప్రభుత్వంలో మాత్రం చలనం లేకుండాపోయింది. ముందుముందు బియ్యం కూడా అందిస్తారా.. లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి.

మంత్రి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఒంగోలులో మంగళవారం జరిగిన గురుపూజోత్సవ వేడుకల్లో మున్సిపల్ శాఖా మంత్రి ఉపాధ్యాయులను కించపర్చే విధంగా గురువులు కంటే గూగుల్ మిన్న అని వ్యాఖ్యానించడం మంత్రి స్థాయికి తగదని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హితవు పలికారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన సురేష్ ఉపాధ్యాయులందరినీ అవమానపర్చే విధంగా మాట్లాడడం సమంజసంగా లేదన్నారు. ఇటీవల యునెస్కో విడుదల చేసిన రిపోర్టులో ఆన్‌లైన్ విద్యాబోధన, తరగతి గది ప్రత్యక్ష బోధనకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసిన విషయం మంత్రికి తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆన్‌లైన్ విద్య ద్వారా కరోనా సమయంలో విద్యార్థులు ఆశించిన ప్రమాణాలు సాధించలేకపోయినట్లు రిపోర్ట్ తెలిపిందని, విద్యార్థి నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, సృజనాత్మకత, పెద్దల పట్ల వినయ విధేయతలు, సమాజం పట్ల అవగాహన, ఉత్తమ పౌరుడుగా తీర్చి దిద్దబడడం గురువు ద్వారా మాత్రమే పొందగలడని తెలిపారు. మంత్రి వ్యాఖ్యలు ఉపాధ్యాయుల పట్ల ఈ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తున్నాయన్నారు. తక్షణం మంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

యువగళం క్యాంపు సైట్‌లో అర్ధరాత్రి పోలీసులు హల్‌చల్

భీమవరం రూరల్, కాళ్ల : బేతపూడి యువగళం క్యాంపు సైట్‌లో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు హల్‌చల్ చేశారు. మూడు వ్యాన్లలో క్యాంపు వద్దకు చేరుకున్న పోలీసులు క్యాంపును చుట్టుముట్టి వాలంటీర్లపై దురుసుగా ప్రవర్తించారు. వాలంటీర్లు, కిచెన్ సిబ్బంది, క్యాంపు ఏర్పాటు చేసే సిబ్బంది మొత్తం 50 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని కాళ్ల మండలం సీసలి రాజ్యలక్ష్మి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ వద్దకు తరలించారు. ఈ విషయం బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తెలియగానే టిడిపి నేతలు అక్కడికి చేరుకుని వాలంటీర్లను ప్రయివేటు భవనంలో నిర్బంధించడం ఏమిటని నిలదీశారు. సుమారు గంట అనంతరం మధ్యాహ్నం 12 గంటలు దాటాక వారిని అక్కడ నుంచి కాళ్ల పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఆకివీడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆకివీడు నుంచి వేరే పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా టిడిపి నాయకులు పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో వాలంటీర్లను భీమవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

టిడిపికి చెందిన 56 మందిపై కేసుల నమోదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం శివారు తాడేరు టౌన్‌షిప్ వద్ద వైసిపి, టిడిపి పరస్పర దాడులకు సంబంధించి టిడిపికి చెందిన 56 మందిపై భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. లోకేష్ యువగళం పాదయాత్రలో మంగళవారం రాత్రి తాడేరు టౌన్‌షిప్ వద్ద వైసిపి, టిడిపి శ్రేణులు పరస్పర దాడికి దిగిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి దాయం బెంజిమెన్, మల్లు మణికంత, మైలాబత్తుల మహేష్ ఫిర్యాదు మేరకు 43 మంది యువగళం కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. వీరిలో 38 మంది భీమవరం స్టేషన్లో ఉండగా, మరో ఐదుగురు నిడమర్రు స్టేషన్లో ఉన్నారు. అలాగే వైసిపి నేత తోట భోగయ్య ఫిర్యాదు మేరకు టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు, దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, టిడిపి నేతలు కౌరు పృథ్వీశంకర్, చిలుకూరి రామకృష్ణచౌదరి, ధర్మేంద్ర, కడిమి సూర్యనారాయణ, వీరవల్లి చంద్రశేఖర్, మద్దుల రాము, ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, కడలి వాసు, కల్లేపల్లి శ్రీను, కవురు భాస్కరరావు మొత్తం 13 మందిపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అలాగే గాయాలైన పోలీసుల్లో ఒకరైన కాళ్ల పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ దొంగ రమేష్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశారు. అలాగే టిడిపి మండలాధ్యక్షుడు కౌరు పద్వీ తనపై కొందరు దాడి చేశారని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న యువగళం కార్యకర్తలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వన్‌టౌన్, టుటౌన్ సిఐలు అడబాల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టుకు తరలించారు.

యువగళం వాలంటీర్లకు టిడిపి నేతల పరామర్శ

పోలీసుల అదుపులో ఉన్న యువగళం కార్యకర్తలను స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీ మంత్రులు దేవినేని ఉమ, కొల్లు రవీంద్ర పరామర్శించారు.

లోకేష్ యాత్ర రక్తకాండ : మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రక్తకాండను సృష్టిస్తోందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. బుధవారం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. లోకేష్ తన పాదయాత్రలో రౌడీలను వెంటబెట్టుకొని రౌడీయిజం చేస్తున్నాడన్నారు. పాదయాత్రలో సెక్యూరిటీగా పోలీసులను పెడితే లోకేష్ తన మనుషులను పెట్టి కొట్టిస్తున్నాడన్నారు. లోకేష్ వెనుక ఉన్న టీమ్ అందరి ట్రాక్ రికార్డు తనిఖీ చేసి, నేర చరిత్ర కలిగిన వారిని గుర్తించాలని ఎస్‌పికి మంత్రి సూచించారు.

దాడులకు ఉసిగొల్పిన లోకేష్‌పై కేసు పెట్టాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు: భీమవరంలో దాడులకు ఉసిగొల్పిన లోకేష్‌పై కేసు పెట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసాంఘిక శక్తులను తన చుట్టూ పెట్టుకొని లోకేష్ దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ఐటి నోటీసులు ఇచ్చారనే ఆందోళనలో తండ్రీ కొడుకులు ప్రజలపైనే దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఎంఎల్ఎ గ్రంధిని బూతులు తిడుతూ రెచ్చగొట్టే విధంగా వ్యవహరించి ఫ్లెక్సీలు చించివేసి కావాలనే వివాదం సృష్టించారన్నారు. ఇటువంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.

ఓర్వలేకే వైసిపి దాడులు

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

భీమవరం రూరల్ : యువగళం పాదయాత్ర ప్రజాగళంగా మారడాన్ని జీర్ణించుకోలేక జగన్మోహన్‌రెడ్డి, వైసిపి మూకలు ఓర్వలేక దాడులు చేస్తున్నారని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. బేతపూడి యువగళం క్యాంపు వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్‌కు పోలీసులు ఇచ్చిన రూట్‌లో పాదయాత్ర చేస్తే అక్కడ వైసిపి మూకలను పోలీసులు ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. సిఎం సభలు, సమావేశాలకు టిడిపి జెండాలతో తాము వెళితే పోలీసులు ఊరుకుంటారా అని ప్రశ్నించారు. పాదయాత్ర మధ్యలోకి వైసిపి జెండాలతో వచ్చి లోకేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుంటే పోలీసులు ఎందుకు అనుమతించారన్నారు. సిఎం సభలు, పర్యటనలు ఉంటే టిడిపి నేతలను హౌస్ అరెస్టులు, 30 యాక్ట్ అంటూ నిర్బంధించే పోలీసులు మంగళవారం రాత్రి జరిగిన ఘటనకు ఏం సమాధానం చెబుతారన్నారు. వైసిపి అరాచకవాదులు అలజడి సృష్టించబోతున్నారని ఎస్‌పి, డిఎస్‌పికి తాము సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. లోకేష్‌పై దాడిని ప్రతిఘటించిన వాలంటీర్లను అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యం, ఏకపక్ష వైఖరితోనే పాదయాత్రపై వైసిపి మూకలు దాడి చేశారన్నారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ వైసిపి మూకల దాడిలో మాజీ ఎంఎల్ఎ శివరామరాజు గాయాల పాలయ్యారన్నారు. అరెస్టు చేసిన వాలంటీర్లను తక్షణం విడుదల చేయాలని, లేకుంటే పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. శ్రీను అనే సిఐ వైసిపి గూండాలను దగ్గరుండి ప్రోత్సహించారని ఆరోపించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక వైద్య సేవలందిస్తోందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజతో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, పూనం మాలకొండయ్యతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ఈ నెలాఖరున ప్రారంభిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) వైద్య శిబిరాలు ప్రతి జిల్లాలోని పట్టణాల్లోనూ, మండలాల్లోనూ నిర్వహించడం జరుగుతోందన్నారు. వాలంటీర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పిహెచ్‌సి డాక్టర్లు, స్పెషలిస్టులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు మున్సిపల్ కమిషనర్లు, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వీటికి సంబంధించిన యాప్‌ను వాలంటరీ డౌన్‌లోడ్ చేసుకుని కార్యక్రమానికి ముందే ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలపై సర్వే చేయించాలని, అలాగే ఆశా వర్కర్లు ఎఎన్ఎంలు వారికి సంబంధించిన రోగాలను గుర్తించి మెడికల్ క్యాంపు నిర్వహించే ప్రాంతానికి తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తహశీల్దార్లు, ఎంపిడిఒలు మెడికల్ అధికారులు నిర్వహణకు సంబంధించి షామియానాలు, ప్రదేశాన్ని ఏర్పాట్లను పర్యవేక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పబ్లిసిటీ క్యాంపు వివరాలను షెడ్యూల్‌ను మండల అధికారులు తయారుచేసి సిద్ధం చేయాలన్నారు. అలాగే ఐసిడిఎస్, అంగన్‌వాడీ పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు, పాఠశాల, కాలేజీ విద్యార్థులకు శిబిరాల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. మెడికల్ క్యాంపునకు సంబంధించి మందుల కిట్స్, 104 వాహనాన్ని వినియోగించుకుని క్యాంపులు నిర్వహించాలన్నారు. దీనికి సంబంధించి జిఒ విడుదల చేయడం జరుగుతుందని, జిఒలో పొందుపర్చిన మార్గదర్శకాలను అనుసరించి అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను విజయవంతం చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహణ జిల్లాలో విజయవంతం చేయడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్, మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖాధికారి ఎస్.శర్మిష్ట, డిసిహెచ్ఎస్ డాక్టర్ కె.పాల్ సతీష్‌కుమార్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ జోషి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిపిఒ తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, డిఇఒ జి.శ్యాంసుందర్, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

చినుకుజాడతో ఊపిరి పీల్చుకున్న రైతాంగం

ఖరీఫ్, వరిసాగుకు మేలు..

ప్రజాశక్తి - ముసునూరు

ఎట్టకేలకు వర్షం పడటంతో రైతాంగం ఊపిరి పీల్చుకుంది. బుధవారం మండలంలోని ముసునూరు, చింతలవల్లి, లోపూడి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో వరి, మెట్టపరులైన పత్తి, పెసర, మినుము, మొక్కజొన్న పంటలకు ఊపిరి పోసినట్లైందని రైతులు అనుకుంటున్నారు. అదేవిధంగా గ్రామాల్లో ముసునూరు బిసి ఏరియాలో రజకులపేట వద్ద డ్రెయినేజీ పూర్తిగా కూరుకు పోవడంతో, రోడ్డుపై నీళ్ల నిలిచిపోయి, ఇళ్లల్లోకి చేరాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలో బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో మొదలైన వర్షం గంట వరకూ పడింది. వర్షంతో ముదినేపల్లిలోని ప్రధాన రహదార్లపై నీరు నిలిచిపోయింది. అసలే రోడ్లన్నీ గుంతలుగా మారడంతో వర్షపు నీరు గుంతల్లో చేరింది. దీంతో రోడ్డు కనబడక వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురైయ్యారు. వర్షపు నీటిలోనే నడచుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈవర్షం ఖరీఫ్, వరి సాగుకు మంచి ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. నీటి ఎద్దడి దృష్ట్యా మండలంలో ప్రధాన పంటకాల్వలు ద్వారా వంతులు వారీ విధానంతో అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పలు మెరక గ్రామాల్లో వరి చేలకు నీరు అందని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో ఆడపా దడపా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్, వరి సాగుకు మేలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ప్రజా సమస్యలపై కథనాలు అభినందనీయం

ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో డిఎస్‌పి ధనుంజయుడు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రజా సమస్యలపై 'ప్రజాశక్తి కథనాలు' అభినందనీయమని డిఎస్‌పి ఎం.ధనుంజయుడు తెలిపారు. 'ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం' నేపథ్యంలో బుధవారం జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రత్యేక సంచికను డిఎస్‌పి ఎం.ధనుంజయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిష్పక్షపాతంగా వార్తలను ప్రచురించడంలో 'ప్రజాశక్తి' తన ప్రత్యేకతను చాటుకుందని తెలిపారు. అలాగే ప్రజాశక్తి పాఠకులకు, సిబ్బందికి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా రిపోర్టర్ పి.గంగరాజు, ఎడిటివి జిల్లా ఇంఛార్జి పెన్మెత్స నారాయణరాజు, సర్క్యులేషన్ ఇంఛార్జి వైసేతారాం, డివిజన్ ఇంఛార్జి జి.మాణిక్యాలరావు, రిపోర్టర్లు ఎ.రంగా, ఎన్.రవి, జి.మధు, పితల అర్జునరావు పాల్గొన్నారు.

ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి..

పలు పోస్టుల నియామకానికి గడువు పొడిగింపు

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో పలు పోస్టులు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై ఒక సంవత్సరం కాలపరిమితితో నియమించుటకు గడువును సెప్టెంబర్ 8వ తేదీ వరకూ పొడిగించినట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.పి.పాల్ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించబడునన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వెబ్‌సైట్, జిల్లా వెబ్‌సైట్ https://eluru.ap.gov.in, https://westgodavari.ap.gov.inను సందర్శించవచ్చునన్నారు. ఖాళీగా వున్న మూడు ఆడియో మెట్రిషియన్(ఎఎంటి) పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిపై ఎస్‌సి మహిళ-1, పిహెచ్-విహెచ్ జనరల్-1 ఎస్‌టి మహిళలకు కేటాయించబడ్డాయి. ఔట్‌సోర్సింగ్ కింద ఆఫీస్ సబ్‌ఆర్డినేట్ ఒక పోస్ట్ ఒసి జనరల్‌కు, ఔట్ సోర్సింగ్ కింద జనరల్ డ్యూటీ అటెండెంట్ ఎస్‌టి జనరల్, ఔట్ సోర్సింగ్ కింద ప్లంబర్ ఎస్‌టి మహిళకు, ఔట్ సోర్సింగ్ కింద పోస్ట్‌మార్టం అసిస్టెంట్ పిహెచ్-హెచ్‌ఐ జనరల్‌కు కేటాయించిన పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

ఎస్ఐ సెలక్షన్స్ వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 7న జరగాల్సిన ఎస్ఐ సెలక్షన్‌లు వర్షం కారణంగా వాయిదా వేసినట్లు ఏలూరు రేంజ్ డిఐజి జివిజి అశోక్ కుమార్ పత్రికా ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు వారిచే ఏలూరు రేంజి పరిధిలో సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు (పురుషులు/మహిళలు), ఎపిఎస్‌పి, ఆర్ఎస్ఐ పురుషులు, ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఫిజికల్ మెజెర్మెంట్ పరీక్ష(పిఎంటి), ఫిజికల్ ఎఫిషయన్స్ పరీక్ష(పిఇటి)లను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పెరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 7న జరగాల్సిన ఎస్ఐ సెలక్షన్‌లను వర్షం కారణంగా ఈనెల 14వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈనెల 8న జరగాల్సిన ఎస్ఐ సెలక్షన్‌లు యథాతదముగా జరుగుతాయని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి అశోక్ కుమార్ ఆ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి : టిడిపి

టి.నరసాపురం : రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి తెలిపారు. మండలంలోని కె.జగ్గవరంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర చూసి వైసిపి నాయకుల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయన్నారు. భీమవరంలో యువగళం పాదయాత్రలో వైసిపి నాయకులు దాడి చేయడం నీచమైన చర్య అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతి పక్షంలో వుండి పాదయాత్ర చేసినప్పుడు టిడిపి ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తే పాదయాత్ర చేయగలిగే వాడా అని ప్రశ్నించారు. లోకేష్ పాదయాత్రతో వైసిపికి మనుగడ వుండదని హెచ్చరించారు. వైసిపి నాయకులు విచక్షణ కోల్పోయి దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఆచంట అనిల్ కుమార్, ఉప సర్పంచి భీమవరపు జగన్మోహనరావు, గ్రామకమిటీ అధ్యక్షులు జయ్యవరపు శ్రీనివాసరావు, కాసన్నేని మాధవరావు, నాయకులు జయ్యవరపు వెంకటేశ్వరరావు, అద్దంకి రాంబాబు, డోలా రామయ్య పాల్గొన్నారు.

యువగళం వాలంటీర్లకు సంఘీభావం

కలిదిండి : పశ్చిమగోదావరి జిల్లాలో లోకేష్ యువగళం పాదయాత్రలో ఆయన వ్యక్తిగత వాలంటీర్లను, టిడిపి కార్యకర్తలను కలిదిండి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారనే సమాచారంతో వారికి సంఘీభావంగా టిడిపి శ్రేణులు స్టేషన్‌కు చేరారు. అదే జిల్లాలోని ఆకివీడు తరలించారనే సమాచారంతో స్టేషన్ నుంచి తమ వాహనాలతో అక్కడకు బయలుదేరి వెళ్లారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

ఏలూరు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పాఠశాల/కళాశాలల అధికారులు హెడ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్, ఇన్‌స్టిట్యూట్ నోడల్ ఆఫీసర్ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్లో బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పనిసరిగా చేయాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ సహాయ సంచాలకులు ఎస్ఎస్.కృపావరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ ఉపకార వేతనాల మంజూరు కోసం పాఠశాల/కళాశాల అధికారులు వారి బయోమెట్రిక్ అథెంటికేషన్ కోసం ఈనెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు వారి ఆధార్ కార్డ్, ఆధార్ కార్డ్ లింక్డ్ సెల్ నెంబర్, ఎన్ఎస్‌పి యూజర్ ఐడి, పాస్‌వర్డ్ తీసుకొని రావాలన్నారు. గత ఏడాది దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటికేషన్ కోసం విద్యార్థి ఆధార్ కార్డ్, ఆధార్ కార్డ్ లింక్డ్ సెల్ నెంబర్, సదరు విద్యార్థిని తీసుకుని జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం ఏలూరుకు రావాల్సిందిగా తెలిపారు. బయోమెట్రిక్ అథెంటికేషన్ పూరైన పాఠశాల/కళాశాలల అధికారులు విద్యార్థుల స్కాలర్‌షిప్ మంజూరు చేయుటకు నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ https://scholarships.gov.in వెబ్ సైట్‌లో, ఇన్‌స్టిట్యూట్ లాగిన్‌లో వారి వారి విద్యార్థుల దరఖాస్తులను జిల్లా మైనారిటీస్ సంక్షేమ కార్యాలయాలకు ఆన్‌లైన్ ద్వారా పరిశీలించి పంపవలసిందిగా తెలిపారు.

నేరాలు - ఘోరాలు

మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసినవారిపై కేసు

చింతలపూడి : మహిళను బ్లాక్ మెయిల్ చేసి వేధిస్తున్న ముగ్గురు వ్యక్తులపై దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన చింతలపూడి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి గ్రామానికి చెందిన బాధిత మహిళ, సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఆ సమయంలో ఇద్దరూ కలిసి తీసుకున్న ఫోటోలను సుబ్రహ్మణ్యం మార్ఫింగ్ చేశాడు. అంతేకాకుండా మార్ఫింగ్ ఫోటోలను సుబ్రహ్మణ్యం తన స్నేహితులైన కిరణ్, నానీలకు పంపించాడు. అనంతరం ముగ్గురూ కలిసి బాధిత మహిళను మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. మంగళవారం బాధిత మహిళకు మార్ఫింగ్ చేసిన ఫోటోలను పంపించి, తాము చెప్పినట్లు చేయకపోతే సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరించారు. దిక్కుతోచని పరిస్థితుల్లో బాధిత యువతి దిశ పోలీసుల సహాయం కోరింది. వేధింపులకు పాల్పడిన సుబ్రహ్మణ్యం, కిరణ్, నానిలపై ఐపిసి సెక్షన్ 324, 354, 374 ల కింద చింతలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా మహిళకు రక్షణగా ఉంటామని, ఎలాంటి భయాందోళనకు గురికానవసరం లేదని దిశ పోలీసులు హామీ ఇచ్చారు.

పిల్లలతో సహ వివాహిత అదృశ్యం

ముసునూరు : వివాహిత మహిళ పిల్లలతో సహా కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తండ్రి. ముసునూరు మండలం చింతలవల్లి గ్రామానికి చెందిన వివాహిత తన భర్త సరిగ్గా చూసుకోకపోవడంతో ఆమె పిల్లలతో సహా తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమె పిల్లలతో సహా గత ఆదివారం నుంచి కనిపించడం లేదని, రెండు రోజులు పాటు కుటుంబసభ్యులు, బంధుమిత్రుల సహాయంతో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.కుటుంబరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగుల మందు డబ్బాలోని నీళ్లు తాగి వ్యక్తి మృతి

ముసునూరు : పొలం పనికి వెళ్లి వస్తూ మార్గమధ్యలో పురుగుల మందు డబ్బాలోని నీళ్ల తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలం లోపూడి గ్రామానికి చెందిన తాళం మద్దిరామయ్య(40) బుధవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం పనుల నుంచి వస్తూ, అతిగా దాహం వేయడంతో, పురుగుల మందు డబ్బా అని తెలియక, అందులో నీళ్ల తాగారు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో, అతని కుటుంబ సభ్యులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మరణించారు. ఎస్ఐ ఎం.కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. పెద్ద పాపకు వివాహమైంది. కుటుంబ పెద్ద మరణించడంతో కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాట్రేనిపాడులో చోరీ

మూడు కాసుల బంగారం, రూ.31 వేల నగదు అపహరణ

ముసునూరు : నూజివీడు డివిజన్ ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామంలో బడిపాటి సాంబయ్య ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన బడిపాటి సాంబయ్య గత రెండు నెలల క్రితం తమ కోడలు కాన్పు నిమిత్తం హైదరాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండగా, అతని ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దుండగులు ఇంటిలోకి చొరబడి బీరువాలు ధ్వంసం చేసి, మూడు కాసుల బంగారం, రూ.31 వేల నగదు దొంగలించినట్లు సమాచారం. ఎస్ఐ ఎం.కుటుంబరావు, నూజివీడు ఏరియా సిఐ అంకబాబు, సిబ్బందితో పాటు, జిల్లా క్లూస్ టీం సభ్యులతో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

నిందితుడికి 8 నెలలు జైలు

ముదినేపల్లి : దొంగతనం కేసులో నిందితునిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 8 నెలలు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదపాలపర్రు గ్రామానికి చెందిన సూరపనేని సుజాత (70) ఇంటిలో గత ఏడాది మార్చి 11న గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తలుపులు గట్టిగా కొట్టగా, ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలు వచ్చి తలుపులు తీసింది. దీంతో ఆమె మెడలోని బంగారు నానుతాడును దొంగ లాక్కుని పారిపోయాడు. ఈవిషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా దొంగ కృష్ణాజిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన గరికె సుబ్బరాజును గత ఏడాది అరెస్ట్ చేసి, అతని వద్ద బంగారు నానుతాడు స్వాదీనం చేసుకొని, సుజాతకు అప్పగించారు. ఈకేసులో 10మంది సాక్షులను విచారించి సుబ్బరాజుకు 8 నెలలు సాధారణ జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సమస్యల వలయంలో ముదినేపల్లి బస్టాండ్

కనీస సౌకర్యాలు కరువు
ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
పట్టించుకోని ఆర్‌టిసి అధికారులు

దూరంగా నిపిపివేసిన బస్సు..

పాడైన మంచినీటి కుళాయి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆ బస్టాండ్ అనేక సమస్యలతో సతమతమౌతోంది. రాష్ట్రంలోని ఏప్రాంతానికైనా ఈ బస్టాండ్ నుంచి ప్రయాణం సాగించవచ్చు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా, నిత్యం బస్టాండ్ నుంచి 24 గంటలూ బస్సు సర్వీసు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. కూడలి ప్రాంతంగా, ప్రయాణానికి ఎంతో అనువుగా, ప్రాధాన్యత సంచరించుకున్న బస్టాండ్‌లో ప్రస్తుతం సమస్యలు ప్రయాణికులను పట్టి పీడిస్తున్నాయి. అదే ముదినేపల్లి బస్టాండ్..

1986 మార్చి 15న అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి, దివంగత ఎన్‌టి.రామారావు బస్టాండ్‌కు శంకుస్థాపన చేయగా, 21 సెప్టెంబర్ 1989లో అప్పటి రాష్ట్ర విద్యాశాఖా మంత్రి ఎర్నేని సీతాదేవి బస్టాండ్‌ను ప్రారంభించారు. సూమారు ఎకరం పైచిలుకు విస్తీర్ణంలో సూమారు రూ.6లక్షల పైచిలుకు వ్యయంతో అప్పట్లో బస్టాండ్‌ను నిర్మించారు. నాలుగు ప్లాట్‌ఫారాలు నిర్మించారు. సూమారు రోజుకు రెండు వందల వరకూ వివిధ డిపోలకు చెందిన బస్సులు బస్టాండ్‌కు ట్రిప్పులు వేస్తుంటాయి. ప్రస్తుతం బస్టాండ్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు 24 గంటలూ బస్సు సర్వీసులు కొనసాగుతున్నాయి. గతంలో కృష్ణాజిల్లా గుడివాడ డిపో పరిధిలో ఉన్న ముదినేపల్లి బస్టాండ్ జిల్లాలు విభజన నేపథ్యంలో ఏలూరు జిల్లాలో కలిసింది.

తాగునీటికి కటకటలు..

బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మంచినీరు లేదు. గతంలో నిర్మించిన మంచినీటి కుళాయి శిథిలావస్థకు చేరింది. ఎన్నో నెలలుగా మంచినీటి కుళాయి శిథిలావస్థకు చేరినా పట్టించుకున్న నాథుడే లేరు. దీంతో మంచినీటి కోసం ప్రయాణికులు బస్టాండ్‌లోని హోటల్‌కో, లేక బస్టాండ్ బయట ఉన్న దుకాణాలకో పరుగులు తీయాల్సివస్తోంది. మంచినీటి కోసం ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

పాములతో భయం.. భయం..

బస్టాండ్ ఆవరణ చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. దీంతో మరుగుదొడ్లుకు వెళ్లే ప్రయాణికులు భయపడుతున్నారు. ఇటీవల బస్టాండ్ ఆవరణలో పాముల సంచారం కూడా అధికమైంది. పదిరోజుల క్రితం ఆవరణలోకి త్రాచుపాములు రావడంతో ప్రయాణికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మురుగుదొడ్ల డోర్లుకు లాక్‌లు లేవు. మరుగుదొడ్ల సిమెంట్ వరలు పగిలిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మరుగుదొడ్డిలోని వ్యర్థాలు పక్కన ఉన్న చెరువులోకి వెళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఆర్‌టిసి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ప్రయాణీకులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దూరప్రాంతాలకు సర్వీసులు..

ముదినేపల్లి బస్టాండ్ నుంచి రాష్ట్రంలోని దూర ప్రాంతాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, హైదరాబాద్, షాంషాబాద్ విమానాశ్రయం, విజయవాడ, భీమవరం, రాజోలు, అమలాపురం, నరసాపురం, మచిలీపట్నం, తదితర ముఖ్య నగరాలకు బస్సు సర్వీసులు ఉన్నాయి. రాత్రి, పగలు అనే తేడాలేకుండా నిరంతరాయంగా బస్టాండ్ నుంచి బస్సుల రాకపోకలు సాగిస్తున్నాయి.

కానరాని సమయ పట్టిక..

బస్టాండ్‌కు వచ్చే బస్సు సర్వీసుల రాకపోకలు తెలిపే సమయ పట్టిక ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గుడివాడ డిపో అధికారులు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సమయ పట్టిక పాడైంది. దాని స్థానంలో కొత్త సమయ పట్టిక ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నా, ఏలూరు డిపో అధికారులు పట్టించుకోవడం లేదు. బస్సుల సమయం గూర్చి అడిగితే కంట్రాక్టు పద్ధతిలో ఏర్పాటు చేసిన మహిళా కంట్రోలర్ తనకు ఏమీ తెలియదని, తనకు ఇస్తానన్న సమయ పట్టిక కూడ ఇంకా ఇవ్వలేదని చెప్పడం గమనార్హం.

ఏలూరుకు బస్సు నడపాలి..

ముదినేపల్లి మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపడంతో వివిధ పనులపై జిల్లా కేంద్రం ఏలూరు వెళ్లేందుకు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముదినేపల్లి మండలంలోని గ్రామాల నుంచి ఏలూరు వెళ్లేందుకు మూడు బస్సులు ఎక్కాల్సి వస్తోంది. దీంతో మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల ప్రజలు సౌకర్యార్థం ముదినేపల్లి బస్టాండ్ నుంచి ప్రతిరోజూ ఏలూరుకు బస్సులు నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పర్యవేక్షణా లోపం..

బస్టాండ్‌లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో బస్సు డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బస్టాండ్‌లో ఆయా రూట్లను బట్టి కేటాయించిన ప్లాట్‌ఫారం వద్ద బస్సులు నిలుపుదల చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా బస్సులు దూరానా నిలుపుదల చేస్తున్నారు. దూరంగా బస్సులు నిలుపుదల చేయడంతో వృద్ధులు, విద్యార్థులు, బస్సులు వెనుక పరుగులు పెట్టి ఎక్కాల్సి వస్తోంది. ఈ సమయంలో పలుసార్లు పలువురు ప్రమాదాలు బారిన పడిన సంఘటనలూ ఉన్నాయి. మహిళా కంట్రోలర్ డ్రైవర్లకు చెప్పిన మాటలు ఏ మాత్రం డ్రైవర్లు లెక్క చేయడం లేదు.

స్లాబ్ నుంచి కారుతున్న వర్షం..

బస్టాండ్ స్లాబ్ నుంచి వర్షం కారుతోంది. బస్టాండ్ నిర్మించి 37 ఏళ్లు అయ్యింది. దీంతో బస్టాండ్ స్లాబ్ శిథిలావస్థకు చేరి వర్షం పడుతోంది. హోటల్, దుకాణాల్లో వర్షం పడుతోంది. దీంతో స్లాబ్ ఎప్పుడు ఊడి మీద పడుతుందోననే భయం ప్రయాణికులకు, వ్యాపారులకు వెంటాడుతోంది. నిత్యం వందలాది ప్రయాణికులు, విద్యార్థులు రాకపోకలు సాగించే ఈ బస్టాండ్‌లో ఏలూరు డిపో అధికారులు స్పందించి ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

పలు మండలాల్లో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - ఏలూరు

మండలాల్లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని బుధ, శుక్రవారాల్లో కలెక్టర్ స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు నిర్వహించాలని ప్రభుత్వం జిఒ సంఖ్య 1775ను జారీ చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు అందరూ ప్రతీ బుధవారం, శుక్రవారం ఆయా మండలాల్లో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్నారు.

8న పెదవేగిలో జగనన్నకు చెబుదాం

జిల్లా కలెక్టర్ స్థాయిలో మొట్ట మొదటి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని 8వ తేదీ, శుక్రవారం పెదవేగి మండలంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి పెదవేగి మండలంలో జరుగుతుందని ఆయన వివరించారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత డివిజన్ల ఆర్‌డిఒ, డిఎల్‌డిఒ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఆయా మండల ప్రత్యేకాధికారి పర్యవేక్షించాలన్నారు.

సబ్సిడీపై 2 హెచ్‌పి 3 బ్లేడ్స్ చాఫ్ కట్టర్స్

ఏలూరు : పాడి రైతులు పశుగ్రాసాన్ని చాఫ్ చేసుకొనేందుకు ప్రభుత్వం వారు 2హెచ్‌పి 3 బ్లేడ్స్ చాఫ్ కట్టర్స్‌ని సబ్సిడీలో అందజేస్తున్నట్లు పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు డా.జి.నెహ్రూ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాడి పరిశ్రమలో పశుగ్రాసం చాలా ముఖ్యమైన పాత్రపోషిస్తుందన్నారు. పశువులు మేసేటప్పుడు పశుగ్రాసంలో వేస్టేజ్ నివారించుటకు, పాల ఉత్పత్తిని పెంచుటకు చాఫ్ చేసిన పశుగ్రాసం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ దృష్ట్యా చాఫ్ కట్టర్స్‌ను సబ్సిడీపై రైతులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిదన్నారు. చాఫ్ కట్టర్ అసలు ధర రూ.39,970కాగా అందులో రైతు వాటాగా రూ.20,380 భరిస్తే ప్రభుత్వం మిగిలిన రూ.19,590 సబ్సిడీగా అందిస్తుందన్నారు. కావున చాఫ్ కట్టర్ కావాల్సిన పాడి రైతులు సమీప పశువైద్యులను సంప్రదించవలెనని పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు డా.జి.నెహ్రూ బాబు ఆ ప్రకటనలో తెలియజేసారు.

15 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

చిన్నారులతో రెడ్‌క్రాస్ సిబ్బంది, డాక్టర్లు..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 15 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ఎస్ఆర్ కె.వరప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహిస్తున్నామని, ఇందుకు స్వచ్ఛంద రక్తదాతల సహకారం మరువలేనిదని అన్నారు. బుధవారం తలసేమియా చిన్నారులతో పాటువారి తల్లిదండ్రులు 35 మందికి ఉచిత భోజన ఏర్పాటు చేసిన దాతలు, మానవత సభ్యులు బావిశెట్టి చిరంజీవి రావు, పద్మావతి దంపతులకు, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేసిన లైన్స్‌క్లబ్ సభ్యురాలు కె.పద్మజకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ వరప్రసాదరావు, లైన్స్‌క్లబ్ సభ్యులు కె.పద్మజ, పి.అనురాధ పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : సిఐ రాజేష్

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రహదారి ప్రమాదాలలో ప్రాణ నష్ట నివారణకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సిఐ పి.రాజేష్ తెలిపారు. బుధవారం పట్టణంలో పలువురు వాహనదారులకు హెల్మెట్ ధరించడం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ రాజేష్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలలో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతూ ప్రాణనష్టం, శారీరకంగా నష్టాలు జరుగుతున్ననాయని తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించడం జరిగిందని తెలిపారు. నిత్యం హైవేలపై వాహన చోదకులకు 'వాష్ అండ్ డ్రైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రహదారి ప్రమాదాలలో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవ్వటం వలన ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతిఒక్కరూ హెల్మెట్లు ధరించడం వలన ప్రమాద సమయాలలో ప్రాణాపాయం కాకుండా కాపాడుకోగలుగుతామని సూచించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు గురించి విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈక్రమంలో ప్రతీ స్కూలు, కాలేజీలలో రహదారి ప్రమాదాలపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

20 మందితో నూతన కమిటీ

సమస్యలు పరిష్కరించాలని నినదిస్తున్న గిరిజనులు

కామవరపుకోట: కామవరపుకోటలో నూతన గిరిజన మండల కమిటీ బుధవారం ఏర్పాటైంది. ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని కామవరపు కోట మండలం కొండగూడెంలో ఏర్పాటు చేశారు. మండల కమిటీ అధ్యక్షులు అంక్యం రాంబాబు, కార్యదర్శి గోధుమ మధు, డిక్కీ ఏసు, మునుగుల నరసింహమూర్తి, నల్లమొద్దు ప్రభాకర్ రావు, బొగ్గు సుబ్బారాజు, గోధుమ భారతి, జల్లి కృష్ణ 20 మందితో మండల కమిటీ ఏర్పడింది. ఈ సమావేశంలో తాటిచెర్ల, కొత్తగూడెం, గొల్లగూడెం, తదితర గ్రామాల నుంచి గిరిజనులు పాల్గొన్నారు. కామవరపుకోట మండలంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై నూతన కమిటీ నిరంతరం పనిచేస్తుందని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. అలాగే కామవరపుకోట మండలంలో వందలాది సంవత్సరాలుగా నివసిస్తున్న నాయక్ కులస్తులకు 2019లో నిలిచిపోయిన ఎస్‌టి సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని తదితర సమస్యలపైన ఈ కమిటీ చర్చించింది. ప్రభుత్వం మండలంలో సమస్యల్ని పరిష్కరించాలని కమిటీ కోరింది.

మురళీకృష్ణ సేవలు అభినందనీయం : జెడ్‌పిటిసి

మురళికృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నేతలు..

ప్రజాశక్తి - పోలవరం

మండల అభివృద్ధిలో మండల వైసిపి కన్వీనర్ బుగ్గా మురళికృష్ణ చేసిన సేవలు ఎనలేనివని, అభినందనీయమని జడ్‌పిటిసి కలుం హేమ కుమారి తెలిపారు. బుధవారం పోలవరంలోని మురళి నివాసంలో ఆయన జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి పొడుం పుష్ప, ఉప సర్పంచి కోరసిక శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కరించడంలో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పట్టిసీమ సొసైటీ ప్రెసిడెంట్ రాజబాబు, లంకా సూర్య అప్పాజీ, షేక్ షహేన్షా భాషా, సొబ్బన మోహన్, ఘంటా శ్రీను, అక్కాబత్తుల రాజు, గోకారాజు, సాయి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పాత పోలవరం వెంకటేశ్వర స్వామి ఆలయం, బిసి కాలనీలో మహాగణపతి ఆలయం, సువర్చలా సమేత అభయాంజనేయస్వామి ఆలయం, గూటాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పట్టిసీమ వెంకటేశ్వర స్వామి ఆలయం, బెస్త వీధి రామాలయాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయస్వామి ఆలయ అర్చకులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూజివీడు రూరల్ : మండలంలోని పడమర దిగవల్లి, దేవరగుంట గ్రామాలలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు టిడిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆటల పోటీలు

ముసునూరు : శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా మండల కేంద్రమైన ముసునూరు తూర్పువైపు రామాలయంలో ఈనెల 7, 8 తేదీల్లో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మండల స్థాయి పోటీలలో గెలుపొందిన కబడీ టీం సభ్యులకు ప్రథమ బహుమతి రూ.7వేల నగదు, ద్వితీయ బహుమతి రూ.6వేల నగదు, మరికొన్ని ప్రోత్సాహక బహుమతులు కలవని కమిటీ సభ్యులు చిమట నాగేశ్వరరావు, చిమట సుబ్రహ్మణ్యం, చింతా శివరాంబాబు, చింతా జగదీష్, పాకనాటి శివ నరసింహారావులు తెలియజేశారు.

సీనియర్ జర్నలిస్ట్ ఇజ్రాయేల్‌కు సన్మానం

ఇజ్రాయేల్‌ను సన్మానిస్తున్న ఎంపిటిసి..

కలిదిండి : కైకలూరు నియోజకవర్గ స్థాయిలో గత 35 ఏళ్ల నుంచి పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న పొంగులేటి ఇజ్రాయేల్‌ను కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఎంపిటిసి నీలిసుమన్ ఆధ్వర్యంలో తన కార్యాలయంలో సన్మానించారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పాత్రికేయులు నిరంతరం శ్రమిస్తుంటారని నీలి సుమన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట కలిదిండి ఎంపిటిసి చాన్ భాషా, నాయకులు కుంబా నాగరాజు, మావులూరి బాబూరావు, కాశీరాజు పాల్గొన్నారు.

నేడు, రేపు మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పల్లెర్లమూడి హైస్కూల్లో మండల స్థాయి ఆటల పోటీలను ఈనెల 7, 8 తేదీలలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు బుధవారం తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్, త్రోబాల్, యోగా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 7వ తేదీన బాలురకు, 8వ తేదీన బాలికలకు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

'పార్టీకి తీరని లోటు'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పులి రామన్నగూడెం సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు మడకం గంగరాజు లేకపోవడం పార్టీకి తీరని లోటని జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. బుధవారం మడకం గంగరాజు కుటుంబాన్ని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్‌తో పాటు పార్టీ నాయకులు ఎస్.రామ్మోహన్, కారం రాఘవ, పోరండ్ల శ్రీనివాసు, మాజీ సర్పంచులు కుంజా గంగరాజు, కుంజా కన్నమ్మ, తగరం బాబురావు , జి. లక్ష్మీనారాయణ, కురసం లత, స్థానిక సర్పంచి మడి శ్రీరాములు, ఎంపిటిసి మడకం వెంకటలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగరాజు ఇంక లేకపోవడం బాధాకరమని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని వారు తెలిపారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, (II ADDNL. DISTRICT JUDGE) AT: KHAMMAM
M.A.T.O.P.NO 474 OF 2021
BETWEEN:-
Thulluri Narasimha Rao ...Claim Petitioner
AND
Bheemana NaniBabu & Others ...Respondents
To
Kesireddy Sruthi W/o. Satya Sai Manikanta, Age: major, Occ: Owner of the Lorry Bearing No. AP 37 TE-6009, R/o.H-No:8-82, Junction Road, Bheemadolu (Vill & Mandal), West Godavari Dt.
Take Notice that the above named Claim Petitioner have filed the above O.P. against the respondents claiming compensation. The above case is stands posted to **25-09-2023** for your appearance. Therefore, you are here by directed to appear before the Hon'ble court on **25-09-2023 at about 10-30 A.M.** in person or through an advocate without fail. Failing which the matter will be decided ex-parte against you.
//by order of the Hon'ble court //
05-09-2023 Khammam
YEGINATI NAGESWAR RAO
Advocate, Khammam
CELL 98483 68823

దస్తావేజులు పోయినవి
పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు రాజీవ్ నగర్, వార్డ్ నెంబర్ 8 పసుపులేటి రమేష్, తండ్రి: పసుపులేటి గెద్దయ్య, డో.నెం.45ఎ-3-3/ఎ అను నేను ది.31-08-2023న ఒరిజినల్ లింకు దస్తావేజులు బ్యాగ్‌ను నా మోటార్ సైకిల్ సైడ్ రింగుకి తగిలించుకొని పాలకొల్లు నుండి భీమవరం వస్తుండగా ఒరిజినల్ అయిన నా లింకు దస్తావేజులు నెం. 2287/1997 పాత బస్టాండు సమీపంలో పడిపోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కి తెలియజేయగలరు.
పసుపులేటి రమేష్
తండ్రి: పసుపులేటి గెద్దయ్య
డో.నెం.45ఎ-3-3/ఎ, రాజీవ్ నగర్, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్. సెల్: 89190 14461

పదవ తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్ పోయినది
పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంట మండలం, పెదమల్లం పంచాయతీ పరిధి ఆనగార్ల లంక గ్రామానికి చెందిన ఆకుమర్తి మహేంద్ర, తండ్రి: సత్యనారాయణకు చెందిన తమ పదవ తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్ హాల్ టికెట్ నెంబర్ 1409126149, పదవ తరగతి రిజల్ట్ 2014, రెగ్యులర్ ఒరిజినల్ మార్క్ లిస్ట్ జిరాక్స్ నిమిత్తం ఆనగార్ల లంక నుంచి మోటార్ సైకిల్‌పై పెదమల్లం వస్తుండగా ఒరిజినల్ మార్క్ లిస్ట్ కలిగిన బ్యాగు మార్గ మధ్యలో పడిపోయింది. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియపరచగలరు.
ఆకుమర్తి మహేంద్ర
తండ్రి: సత్యనారాయణ, డో.నెం.3-99/2, ఆనగార్ల లంక, పెదమల్లం, ఆచంట మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 534269.
సెల్: 87907 87309

మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు
I.A.No.307/2023 in O.S.No.1072/2015
Between:
Gaadi Gnana Sree and another ...Petitioners
And
Boddu Sudarsana and others ...Respondents
జడ్జిమెంట్ డెటార్
కొప్పాడ మహేష్, తండ్రి కె.టి.యస్.వి.ప్రసాద్, కేరాఫ్ పీదా సురేష్, డోర్ నెం:13-16-44, బ్రొబ్రొల్లు వారి వీధి, గున్నిపూడి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.
పై నెంబరు దావాలోని ప్రతివాది నెం:5 యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.22-09-2023వ తేదీన ఉన్నది. కావున ఆరోజు ఉదయం గం.10-30 ని॥లకు మీరు కానీ లేదా మీ న్యాయవాది ద్వారా కానీ పై కోర్టు నందు హాజరు కాగలరు. లేనిచో పరోక్షముగా తీర్మానించెదరు.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు మేరకు)
వాయిదా తేది:22-09-2023
విజయవాడ,
ది.28-08-2023
ఇట్లు
వందు నాగరాజు,
పిటీషనర్ తరఫు న్యాయవాది.
SREEJA APARTMENT, 6th ROAD, SRINIVASA NAGAR BANK COLONY, VIJAYAWADA-520008,
Cell No.9440327326

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
ఏలూరు జిల్లా
సెప్టెంబరు 2023
16 పేజీలు

Advt.feature

ప్రజల పక్షాన ప్రజాశక్తి

అంచెలంచెలుగా ఎదిగి నేడు అగ్రశ్రేణి పత్రికల సరసన

రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల విశ్లేషణల్లో ప్రత్యామ్నాయ వాణి

ప్రజాశక్తి దినపత్రిక ప్రజల పక్షాన నిలుస్తోంది. ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదానికి కట్టుబడి ప్రజాశక్తి ప్రస్థానం సాగుతోంది. సంస్థ యావత్ సిబ్బందీ నిరంతరం పట్టుదల, క్రమశిక్షణతో పని చేస్తున్నారు. నిజాలను నిర్భయంగా రాయడంలోనూ.. నిజాయతీగా పనిచేయడంలోనూ ఎక్కడా రాజీపడకుండా ముందుకు సాగుతున్నారు. ఎన్ని కష్టాలొచ్చినా ఎదురొడ్డి నిలబడుతున్నారు. పత్రిక లక్ష్యమే తమ జీవిత ఆశయంగా పని చేసే సిబ్బంది ప్రజాశక్తిలో ఉన్నారు. ప్రజల మన్ననలు పొందడంలోనూ క్రియాశీలకంగా వ్యవహరిస్తూనే ఉన్నారు. అదే స్థాయిలో అన్ని వర్గాల ప్రజానీకం, ..2లో

పర్యాటక ప్రదేశాలుగా ఆలయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మెట్ట ప్రాంతంలో దినదినాభివృద్ధి చెందుతున్న ఆధ్యాత్మిక ఆలయాలు పర్యాటక ప్రాంతాలుగా పలువురిని ఆకర్షిస్తున్నాయి. జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో మద్ది ఆంజనేయస్వామి ఆలయం, గోకులపారిజాతగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల మద్ది ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో నూతనంగా నిర్మించిన కోనేరు, సమీపంలోనే ఉన్న ఎర్రకాలువ జలాశయం పర్యాటకులతో రద్దీగా మారుతున్నాయి. ఎర్రకాలువ జలాశయంలో జలక్రీడల శిక్షణ కేంద్రం ప్రారంభమవ్వడం మరింత ఆసక్తిని నెలకొల్పింది. అలాగే ఇటీవల గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ పరిసరాలను పర్యాటకంగా అభివృద్ధి పరచడానికి గిరి ప్రదక్షణ రోడ్డు మార్గం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మరోవైపు బైనేరు వాగు ఒడ్డున ఉన్న శివాలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలను అధిక సంఖ్యలో యాత్రికులు సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాలు పర్యాటక ప్రాంతాలుగా దర్శనమిస్తున్నాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకంగా ఆధ్యాత్మిక ప్రదేశాలు మరింత అభివృద్ధి చెందుతాయని పలువురు పేర్కొంటున్నారు.

ప్రజల పక్షాన ప్రజాశక్తి

(మొదటిపేజీ నుంచి)

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ కార్మిక సంఘాలు, అధికార వర్గాల నుంచీ ఆదరణ కూడా ప్రజాశక్తికి లభిస్తోంది. ప్రజాశక్తి దినపత్రికగా అవతరించాక అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ నేడు ప్రధాన పత్రికల స్రవంతిలో కలిసింది. అంచెలంచెలుగా ఎదిగి నేడు అగ్రశ్రేణి పత్రికల్లో ఒకటిగా నిలిచింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల్లో ప్రజల పక్షాన నిలిచింది. ప్రజల కోసం ప్రత్యామ్నాయ వాణిని వినిపిస్తోంది. ప్రజల ఎజెండా ఏమిటో పాలకులు ముందుంచడంలో ముందుంది. ప్రజాఉద్యమాలు, పోరాటాలకు బాసటగా నిలిచింది. ఈ కర్తవ్యం నెరవేర్చడంలో ప్రజాశక్తి కీలకపాత్ర పోషిస్తోంది.



కరోనా సమయంలో పత్రికా రంగం మొత్తం సంక్షోభంలో పడింది. అందులో ప్రజాశక్తి కూడా మినహాయింపు కాదు. అప్పటివరకూ పత్రిక నిర్విరామంగా సాగినా కరోనా సమయంలో ఒడిదుడుకులు తప్పలేదు. అన్ని పత్రికలతో పాటు ప్రజాశక్తి కూడా జిల్లా పేజీలను నిలిపేయడం జరిగింది. మళ్లీ 20 ఏళ్ల క్రితం ఏ స్థాయిలో ఉందో ఆ స్థాయికి చేరింది. మళ్లీ మొక్కవోని దీక్షతో యథాస్థితికి తెచ్చే యత్నం సాగుతోంది. తిరిగి జిల్లా పేజీలను పునరుద్ధరించే ప్రయత్నం సాగుతోంది. పత్రికను కరోనా ముందున్న స్థితికి తీసుకుపోయేందుకు సిబ్బంది దీక్షబూని పని చేస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రజాశక్తి ప్రస్థానం

ప్రజాశక్తి దినపత్రికగా ఆవిర్భవించాక ప్రారంభంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంది. విజయవాడ కేంద్రంగా ప్రచురణ కేంద్రం ఉంది. అప్పట్లో మండలాలకు విలేకరులు లేరు. పత్రికల వ్యాప్తి పెరిగాక ప్రజాశక్తి కూడా వాటికి అనుగుణంగానే అభివృద్ధి చెందుతూ వచ్చింది. 1980 దశకంలో కొన్ని ప్రాంతాల్లోనే విలేకర్లు ఉన్నారు. ఆర్‌టిసి బస్సులకు కవర్లు ఇచ్చి విజయవాడకు వార్తలు పంపితే అక్కడ నుంచి ప్రింటింగ్ వేసి.. పత్రికను రైళ్లలో జిల్లాకు పంపేవాళ్లు. వాటిని గ్రామాలు, పట్టణాల్లో ఏజెంట్లు ప్రజలకు అందించడం జరిగేది. 1990 దశకంలో పత్రిక అభివృద్ధికి మరింత వేగంగా అడుగులు పడ్డాయి. 1995 కాలంలో జిల్లా పేజీల ఏర్పాటు జరిగింది. జిల్లాకు రెండు ప్రధాన పేజీలు కేటాయించి స్థానిక వార్తలకు ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో ప్రజల్లో ఆదరణ పెరిగింది. స్థానిక వార్తలు ఇవ్వడంలో ప్రధాన పత్రికలతో పాటు పోటీలో నిలిచింది. దీంతో విలేకర్లు పెరిగారు. మండలాలకు విస్తరణ జరిగింది. 1999లో ఏలూరులోనే కంప్యూటర్, ఇతర సౌకర్యాలతో సబ్ సెంటర్ ఏర్పాటు జరిగింది. అప్పటి నుంచీ వార్తలు సేకరణ, జిల్లా కేంద్రానికి చేర్చే ప్రక్రియ సులభతరం అయింది. పత్రిక అన్ని మండలాలకూ వెళ్లడం ఆరంభమైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 46 మండలాల్లో పత్రిక చందాదారులను సంపాదించుకుంది. వివిధ వర్గాల నుంచీ, శ్రేయోభిలాషుల నుంచీ వార్తలు, సమాచారం ఇంకా పెరగాలనే ఒత్తిడి పెరిగింది. దీంతో ఇంకో ముందడుగు వేసింది. 2004-05 కాలంలో జిల్లా టాబ్లాయిడ్‌ను ప్రారంభించుకున్నాం. ఎనిమిది పేజీలతో జిల్లా టాబ్లాయిడ్ తెచ్చి ప్రధాన పత్రికల సరసన నిలిచింది. అదే క్రమంలో పత్రిక విస్తరణ పెరిగింది. సర్క్యులేషన్ మరింత పెరిగింది. పత్రిక కలర్‌లోకి రావడం కూడా ఇదే కాలంలో జరిగింది. అప్పటి నుంచీ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగింది. ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించిన పేజీల ప్రచురణ రాజమండ్రి నుంచి సాగుతోంది. తాడేపల్లిగూడెం ప్రాంతంలో ప్రచురణ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

అనేక ప్రత్యేక సంచికలు

జిల్లాలో వివిధ రంగాలపై ప్రజాశక్తి అనేక ప్రత్యేక సంచికలు ప్రచురించింది. 1996 కాలంలో పంచాయతీలపై గ్రామస్వరాజ్యం పేరిట ప్రత్యేక సంచిక వెలువడింది. 2000వ సంవత్సరంలో మిలీనియం సంచిక తీసుకొచ్చాం. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అనేక సంచికలు తీసుకురావడం జరిగింది. నియోజకవర్గాల అభివృద్ధిపైనా ప్రత్యేకసంచికలు వచ్చాయి. వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానించి ఆయా రంగాలపై వారి అభిప్రాయాలను ప్రజల ముందుంచింది. ప్రతి రంగంలోనూ ప్రజాకోణం ఏమిటనేది విశ్లేషించి దానికే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. పాలకుల విధానాల వల్ల జరిగే లాభనష్టాలను విశ్లేషించి సమాచారం ఇవ్వడం.. ప్రజలపై మోపే భారాలను ఎప్పటికప్పుడు చెప్పడం కీలకంగా సాగింది. బ్యాంకులు, ఎల్‌ఐసి, టెలికాం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పోరాటాలకు సంఘీబావంగా వారి సమస్యలు వెలుగులోకి తేవడంతో పాటు సమ్మెల్లో ప్రత్యేక సంచికలూ తేవడం జరిగింది. అవి వారికి దిక్సూచిగా నిలిచాయి. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళుతున్నాం. అదే సమయంలో ప్రభుత్వ విధానాల్లో లోపాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాం.

సమిష్టి కృషితో ప్రజాశక్తి అభివృద్ధి

ప్రజాశక్తి ఎదుగుదలకు సంస్థ విలేకరులు, సిబ్బంది, నాయకత్వ సమిష్టి కృషే కారణం. ప్రజాశక్తి అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తున్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా వీరందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచిత విద్య

వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.జగన్

కుదిరితే పరుగెత్తు.. లేకపోతే నడువు.
అదీ చేతకాకపోతే పాకుతూ పో.
అంతేకానీ...
కదలకుండా అలా ఒకేచోట ఉండిపోకు..
-శ్రీశ్రీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సామాజిక సేవా దక్పథంతో కుల మతాలకు అతీతంగా మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వికాస్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను అందిస్తున్నామని వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.జగన్ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తమ విద్యాసంస్థలు స్థాపించిన రెండేళ్లలో విద్యార్థులకు మెరుగైన బోధన సాగించి ఉత్తమ ఫలితాలు సాధించడంలో ప్రత్యేకతను చాటుకున్నామన్నారు. ఆధునిక డిజిటల్ విధానంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నామన్నారు. ఇంటర్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించడానికి అనుభవజ్ఞులైన నార్త్ ఇండియన్ అధ్యాపకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఫలితంగా తమ విద్యార్థులు నీట్ ఫలితాల్లో ఆలిండియా 3528, 4541, 6524 ర్యాంకులు సాధించారన్నారు. ఎపిఇఎపిసెట్ 2023 ఫలితాల్లో తమ విద్యాసంస్థల విద్యార్థులు బైపిసి విభాగం నుండి ఎం.గీతాచరణ్, ఎంపిసి విభాగం నుండి ఎన్‌కె.జగదీపిక ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో విఎస్.ప్రజ్ఞ, నీట్ ఫలితాల్లో వై.చందు, కె.దివ్యరోజి టాప్ ర్యాంకులు సాధించగా మరో 28 మంది ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. 2023 ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయ దుందుభి మోగించారని వివరించారు. ఈ క్రమంలో సీనియర్ ఇంటర్ బైపిసిలో సిహెచ్.చంద్రిక 987, ఎంపిసిలో కెవి.శైలు 981, ఎ.లోకేష్ 983, సిహెచ్.యశ్వంత్ 980, వి.రాజశ్రీ 976, బి.అలేఖ్య 973, వై.అమృతనాయుడు 970 అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి విభాగం నుండి కెవి.శైలు 465, బి.జాహ్నవి, వై.గ్రీష్మ 464, బైసిపి విభాగంలో సిహెచ్.తనుషా 434, ఎ.లోకేష్ 434 అత్యధిక మార్కులు సాధించారని వివరించారు. వికాస్ విద్యాసంస్థల్లో ఐఐటి, జెఎఎ వంటి పోటీ పరీక్షలతోపాటు ఆసక్తి కలిగిన విద్యార్థులకు సివిల్స్ తరహా శిక్షణ ఇస్తున్నట్లు ఛైర్మన్ జగన్ తెలిపారు. ఉత్తమ విద్యను అందించడంతోపాటు అనేక మందికి ఉపాధి అవకాశాలను వికాస్ విద్యాసంస్థలు అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మెట్టప్రాంతంలో దినదినాభివృద్ధి చెందుతున్న తమ వికాస్ విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్తుకు వీలునామా-తల్లిదండ్రుల నమ్మకానికి చిరునామాగా ప్రసిద్ధిగాంచాయని హర్షం వ్యక్తం చేశారు..

వికాస్ విద్యాసంస్థ

నిరంతర కార్యదక్షుడు కొరటాల

బాల్యంలో స్వాతంత్ర్యోద్యమం, యవ్వనంలో కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొంటూ రాటుదేలిన యోధుడు కొరటాల సత్యనారాయణ. కొరటాల అని అందరూ ఆప్యాయంగా పిలుచుకునే ఆయన భౌతికంగా మనల్ని వీడి నేటికి పదిహేడు సంవత్సరాలైంది. స్వాతంత్ర్య సమర యోధుడు, రాష్ట్రంలో మలి తరం కమ్యూనిస్టు నేతల్లో ఒకరు అయిన కొరటాల తెలుగునాట ప్రత్యామ్నాయ మీడియా కేంద్రంగా ప్రజాశక్తి అభివృద్ధిలోనూ చురుకైన పాత్ర పోషించారు. నేడు ఆయన మన మధ్య లేకపోయినా ఆయన అందించిన వారసత్వం ఉంది. 1923 సెప్టెంబరు 21న గుంటూరు జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో బుచ్చయ్య, శేషమ్మ దంపతులకు కొరటాల జన్మించారు. తురిమెళ్ల హైస్కూలులో చదువుతున్న కాలంలోనే ఆయనలో ఒక తిరుగుబాటుదారుడు మనకు అగుపిస్తాడు. ఎస్ఎస్ఎల్‌సి పరీక్షల్లో డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా తురిమెళ్ల హైస్కూలులో 11 రోజుల సమ్మెకు నాయకత్వం వహించారు. 1942లో గుంటూరు ఎ.సి కాలేజీలో ఇంటర్మీడియెట్ కోర్సులో చేరారు. ఇంటర్ రెండవ సంవత్సరం మధ్యలోనే చదువుకు స్వస్తి చెప్పి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. మాకినేని బసవ పున్నయ్య, మోటూరు హనుమంతరావు, లావు బాలగంగాధర రావులతో పరిచయా లేర్పరచుకుని మార్క్సిజం, లెనినిజం విప్లవ పంథాలో పయనించారు. 1942 సెప్టెంబరులో కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా చేరారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుని స్థాయికి చేరుకున్నారు. 1945లో మేనకోడలు సుశీలను వివాహమాడారు. 1962 అసెంబ్లీ ఎన్నికలో వేమూరు నుంచి మొదటిసారి గెలిచారు. రెండోసారి 1978లో రేపల్లె నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 1952లో జరిగిన పార్లమెంటు ఎన్నికల నాటికి పిన్న వయస్కుడే అయినా ఉద్యమాల్లో రాటుదేలిన అనుభవంతో తెనాలి లోక్‌సభ స్థానానికి పోటీచేసి కేవలం 1,100 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1991–97 మధ్య సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా, 2002 నుంచి 2005 వరకు పొలిట్‌బ్యూరో సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. చైనా, బల్గేరియాలలో పర్యటించారు. సీనియర్ నాయకుడిగా ఉన్నప్పటికీ ప్రజలతో అత్యంత సన్నిహిత సంబంధాలను కలిగి ఉండేవారు. వృద్ధాప్యంలో ఉన్నా కొత్తగా పార్టీలోకి వచ్చే యువ కార్యకర్తలు, నాయకులతో చక్కగా కలిసి పోయేవారు. 'ఏరా బాబూ' అనే ఆయన పిలుపులో ఆత్మీయత ఉట్టిపడేది. త్యాగ నిరతికి, మానవతా విలువలకు ఆయన ప్రతీక. అందుకే పార్టీ కార్యకర్తలు ఆయన వద్దకు వెళ్లి తమ సమస్యలను నివేదించేవారు. ఆయన కూడా వారిని చొరవతో అక్కున చేర్చుకునేవారు. ఆయన దగ్గర తరాల అంతరాలు ఎప్పుడూ కనిపించేవి కావు. ఆ విధంగా ఆయన రెండు తరాలకు వారధిగా నిలిచారు. సమస్యను అధ్యయనం చేసి, దానిపై ప్రజలను చైతన్య పరచి పోరాటాల్లోకి సమీకరించడం కొరటాలకు వెన్నతో పెట్టిన విద్య. 1946–48 మధ్య గుంటూరు జిల్లాలో బహుముఖ ఉద్యమాలను నిర్వహించారు. అందులో ముఖ్యమైనవి రొంపేరు బంజరు పోరాటం, లంక భూముల వేలం, బంజర్ల నుంచి పేదల తొలగింపు వ్యతిరేక పోరాటం వంటివి ఉన్నాయి. వ్యవసాయ కార్మికుల వేతనాల కోసం సమ్మెలు, రజకుల మేరల పెంపు, పాలేర్ల జీతాల కోసం పోరాటాలు నడిపారు. సమాజానికి శాపంగా మారిన కుల వివక్షపై పిడికిలి బిగించారు. శాసనసభ్యునిగా ఉండగా భూమిశిస్తు, భూ సంస్కరణలు, నీటి వనరుల పంపిణీ, చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు. విద్యార్థి, రైతు, వ్యవసాయ కార్మిక, చేనేత కార్మిక సంఘాల్లో కార్యకర్తగా, నాయకునిగా తనకున్న అపార అనుభవంతో అసెంబ్లీలో ఏ సమస్యపైన అయినా లోతుగా విశ్లేషించి మాట్లాడేవారు. సూటిగా, పదునైన విమర్శలు చేసేవారు. ఆ సమస్యకు నిర్దిష్ట పరిష్కారాలను సూచించేవారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆయనకు మంచి పట్టు ఉండేది. గుంటూరు జిల్లా కాజ గ్రామంలో సుందరయ్య గారు నిర్వహించిన 'గ్రామీణ పేదలు–భూ పంపకం' సర్వేలో కొరటాల స్వయంగా పాల్గొన్నారు. గ్రామీణ పేదల పరిస్థితిని అధ్యయనం చేసి పత్రికలో పలు విశ్లేషణాత్మక వ్యాసాలు రాశారు. 1982లో గుంటూరు జిల్లాలో పత్తి రైతుల ఆత్మహత్యలు ప్రారంభమైనప్పుడు ఆ సమస్య తీవ్రతపై మొట్టమొదట స్పందించింది ఆయనే. రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో 13 సంఘాలతో కలిపి అఖిలపక్ష సమావేశం జరిపి కార్యాచరణకు పూనుకున్నారు. ఈ ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులను అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని వేయాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో ఆయనే చొరవ తీసుకుని పిఎ చౌదరి కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ చేసిన నిర్ధారణలు, సిఫారసులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిలదీశారు. పొగాకు, మిర్చి, వరి, తదితర పంటలకు గిట్టుబాటు ధర కోసం రైతు సంఘం ఆధ్వర్యాన రాజీ లేని పోరాటం సాగించారు. ఆవిధంగా ప్రతిక్షణం పార్టీగురించి, ప్రజల గురించే ఆయన తపనపడేవారు. జీవిత చరమాంకంలో తనవద్ద మిగిలిన ఆస్తినికూడా పార్టీకి ఇచ్చేశారు.

ప్రజాశక్తి అభివృద్ధికి విశేష కృషి

మోటూరు హనుమంతరావు అనారోగ్యం పాలైన నేపథ్యంలో అనుకోకుండా ప్రజాశక్తి సాహితీ సంస్థ ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. ప్రజాశక్తిని అభివృద్ధి చేయడంలో ఆయన అందించిన తోడ్పాటు మరువలేనిది. నిత్యం పత్రికలను చదివే అలవాటు ఉన్న కొరటాల తన అనుభవాన్ని ఉపయోగించి ప్రతి అక్షరం ప్రజల పక్షం వహించేలా ప్రజాశక్తిని తీర్చిదిద్దాలని తపించారు. సరళీకరణ విధానాల నేపథ్యంలో కార్పొరేట్, విదేశీ కంపెనీలు మన మీడియాను కబళిస్తున్న స్థితిలో ప్రత్యామ్నాయ మీడియా బలపడాల్సిన అవసరాన్ని ఆయన ఎప్పుడూ నొక్కి చెబుతుండేవారు. ప్రజాశక్తి పత్రికలో శీర్షికలు, వార్తలు, వ్యాసాలు, సంపాదకీయాలు, ఫీచర్స్ అన్నిటినీ క్షుణ్ణంగా చదివి అందులోని మంచి చెడులను ఎప్పటికప్పుడు సంబంధిత బాధ్యుల దృష్టికి తెచ్చేవారు. ఎడిషన్ల స్థాపనలో, విస్తరణలో, జిల్లా టాబ్లాయిడ్‌లను మరింత మెరుగుపరచే విషయంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఆయన దీర్ఘకాలం ఆసుపత్రిలో ఉండి ఇంటికి తిరిగి వచ్చినప్పుడు వైద్యులు విశ్రాంతి తీసుకోమని ఇచ్చిన సలహాను లెక్కచేయకుండా ప్రజాశక్తి మేనేజర్ల సమావేశంలో రోజంతా పాల్గొన్నారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ ఛైర్మన్‌గా పెద్దరికంతో కాకుండా ప్రత్యక్షంగా పత్రిక అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషిచేశారు. ప్రజాశక్తి పదకొండు ఎడిషన్లతో ఆనాడు రాష్ట్రమంతటా విస్తరించిందంటే అందులో కొరటాల కృషి ఎంతో ఉంది. 'గొలుసు కట్టు వ్యాపార సంస్థల కబంధ హస్తాల నుంచి మీడియా విముక్తి కావాలని, లేకుంటే పత్రికా రంగం మనుగడే ప్రమాదంలో పడుతుందని' పత్రికా రంగ పితామహుడిగా పేరొందిన ఎం చలపతిరావు మాటలను ఆయన సదా గుర్తు చేస్తుండేవారు. శోధన, పరిశోధన అంటే ఆయనకు ఎనలేని మక్కువ. ఆయన అభిరుచికి తగినట్టుగానే సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కొరటాల పేరుతో 'శోధన' విభాగాన్ని ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో నెలకొల్పడం జరిగింది. ఈ చరాచర జగత్తులో మార్పు ఒక్కటే శాశ్వతమైనది. దానిని నువ్వు అవకాశంగా పరిగణిస్తావో, ముప్పుగా భావిస్తావో అది నీ ఆలోచనను బట్టి ఉంటుంది. కానీ, ఈ పోటీ ప్రపంచంలో నువ్వు నెగ్గుకు రావాలంటే ఆ వేగాన్ని, పోటీని తట్టుకునే శక్తిసామర్థ్యాలను సంతరించుకోవాలి అన్న నానుడిని ఆచరణలో చూపించిన కమ్యూనిస్టు యోధుడు కొరటాల.

– వి. కృష్ణయ్య

ఉద్యమ బలం, గళం, కలం.. ఎంహెచ్

ఎం.హెచ్ అనే రెండక్షరాలతో నిలిచిపోయిన ఆ మనిషి ఉద్యమాల మార్గదర్శి, అక్షరాల రూపశిల్పి. ఆశయాలనూ ఆచరణనూ మేళవించిన అరుదైన అనుభవం ఆయనది. రాజీ పడని సిద్ధాంతబలం, కట్టు తప్పని పట్టుదల, ప్రమాణాలకు ప్రతిరూపమైన ప్రయాణం మోటూరుది. ప్రచార పటాటోపం లేని ప్రతిభ, ప్రజాసేవ ఆయన స్వంతం. సమాజంలో పదవుల కోసం పాకులాట, సంపదలకై వెంపర్లాట, అసహన దూషణలూ నీతిమాలిన మీడియా ధోరణులు ప్రబలుతున్న ఈ రోజున మోటూరు విలక్షణమైన ఆదర్శంగా గోచరిస్తారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం, సంపాదక కృషి, పార్లమెంటరీ ప్రస్థానం, నిరాడంబరత్వం, నిబద్ధత మార్గదర్శకమవుతాయి.

తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ మహత్తర పురోగమనానికీ ఆటుపోట్లకూ పునర్నిర్మాణాలకూ సారథ్యం వహించిన పెద్దలలో ప్రముఖ స్థానం వహించిన నేత మోటూరు హనుమంతరావు. ఎం.హెచ్ అనే రెండక్షరాలతో నిలిచిపోయిన ఆ మనిషి ఉద్యమాల మార్గదర్శి, అక్షరాల రూపశిల్పి. ఆశయాలనూ ఆచరణనూ మేళవించిన అరుదైన అనుభవం ఆయనది. రాజీ పడని సిద్ధాంతబలం, కట్టు తప్పని పట్టుదల, ప్రమాణా లకు ప్రతిరూపమైన ప్రయాణం మోటూరుది. ప్రచార పటాటోపం లేని ప్రతిభ, ప్రజాసేవ ఆయన స్వంతం. సమాజంలో పదవుల కోసం పాకులాట, సంపదలకై వెంపర్లాట, అసహన దూషణలూ నీతిమాలిన మీడియా ధోరణులు ప్రబలుతున్న ఈ రోజున మోటూరు విలక్షణమైన ఆదర్శంగా గోచరిస్తారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం, సంపాదక కృషి, పార్లమెంటరీ ప్రస్థానం, నిరాడం బరత్వం, నిబద్ధత మార్గదర్శకమవుతాయి. దశాబ్దాల పాటు ఆయన నాయకత్వంలో నడచిన నాటి నాయక శ్రేణికీ, తదుపరి తరంలో తనతో సన్నిహితంగా మసలిన మాలాంటివారికీ కూడా ఆయన జ్ఞాపకం ఒక చెరగని ఉత్తేజం. అంత సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వంతో పాటు కమ్యూనిస్టు పత్రికల నిర్వహణతోనూ అంతగా పెనవేసుకుపోవడం మోటూరుకే చెల్లింది.

నిర్బంధాలు, నిషేధాల మధ్యనే..

అక్టోబరు విప్లవంతో పుట్టానని సగర్వంగా చెప్పుకునే మోటూరు గుంటూరు ఎ.సి కాలేజీలో చదువుతున్నప్పుడే కమ్యూనిస్టు అయ్యారు. అది బ్రిటిష్ పాలనలో ఆ పార్టీపై నిషేధం వున్న కాలం. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, బాట్లీవాలా వంటి వారు వచ్చినపుడు ఆయన గది ఆశ్రయమైంది. చిన్న వయసులోనే వున్న కొద్ది పొలం అమ్మి గుంటూరులో 'సిటీ స్టూడెంట్స్ ఎంపోరియం' పేరిట పుస్తకాల షాపు పెడితే దానిపైనా సిఐడిలు దాడిచేశారు. అక్కడి నుంచి ఎలాగో తప్పించుకున్నారు. ఉత్తరోత్తరా మోటూరు ఉదయంగా మహిళా ఉద్యమ పతాకమెగరేసిన ఉదయలక్ష్మిని సంస్కరణ వివాహం చేసుకోవడం, కమ్యూనిస్టు పార్టీలో సభ్యులవడం 1937 లోనే జరిగాయి. లావు బాలగంగాధరరావు వంటి వారు సమకాలీనులైతే సుందరయ్య బయిట నుంచి వచ్చి వెళ్లేవారు. మాకినేని బసవపున్నయ్య నుంచి మోటూరు గుంటూరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి బాధ్యత తీసుకున్నారు. 1942 వరకూ పార్టీపై నిషేధం, నిర్బంధం మధ్యనే ఉద్యమాన్ని పెంపొందించేందుకు కృషిచేశారు. క్షేత్రస్థాయి ఉద్యమ నిర్మాణం, నాయకత్వంతో పాటు పత్రికా రచన, కళా సాహిత్యంలోనూ ఎం.హెచ్ పట్టు పెంచుకున్నారు. అప్పుడే తెలంగాణ సాయుధ పోరాటం మొదలైంది. మొగల్‌రాజపురంలో కాట్రగడ్డ వారి పొగాకు బేరన్లలో నిర్మించుకున్న ప్రజాశక్తి నగర్ అందుకు సహాయ సామగ్రి అందించే ఆశ్రయమైంది. 1947లో వచ్చిన ప్రకాశం ఆర్డినెన్సు కమ్యూనిస్టులపై దారుణమైన వేటగా మారింది. ప్రజాశక్తి నగర్ ధ్వంసం చేయబడింది. అప్పటికే మోటూరు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడుగా ఎన్నికైనారు. 'ప్రజాశక్తి' స్థానంలో మాసపత్రికగా 'జనత' తీసుకుని రావడానికి సన్నాహాలు జరిగాయి. 1977లో ప్రజాశక్తిలో చేరాక నేను పాత పత్రికలు తిరగేస్తుంటే జనత తొలి సంపాదకీయంలో ఎం.హెచ్ భాష కనపడింది. ఆయనను వెళ్లి అడిగితే తనే రాసిన సంగతి గుర్తుకు వచ్చింది. అయితే ఇంతలోనే ఆయను అరెస్టు చేయడంతో గంగినేని వెంకటేశ్వరరావు, బొమ్మారెడ్డి గారు ఆ పత్రికను కొనసాగించారు. మొదటి నుంచి ఈ విధంగా పత్రికలతో ఎం.హెచ్ పాత్ర కనిపిస్తుంది. భయంకరమైన కడలూరు జైలు జీవితం గడిపారు. జైలులోనే పోలీసు కాల్పులు జరిపితే అనుమర్లపూడి సీతారామరావు బలికావడం, ఈయనకు కొద్దిలో గుండు తప్పిపోవడం జరిగాయి. ఇంకా చాలామందికి గాయాలు తగిలాయి. అనంతపురం తొలి పాత్రికేయులలో ఒకరైన రామకృష్ణ కు అప్పుడే ఒక కన్నుపోయింది. ఆయన కూడా చాలాకాలం ప్రజాశక్తి విలేకరిగా పనిచేశారు.

చట్టసభలు..జైలు శిక్షలు ..పత్రికలు..

నిషేధం ఎత్తివేత తర్వాత 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా జరిగిన తొలి ఎన్నికలలో ఎం.హెచ్ రేపల్లె నుంచి మంత్రి చంద్రమౌళిని ఓడించి శాసనసభకు ఎన్నికైనారు. కమ్యూనిస్టుల నాటి విజయపరంపరలో ఈ గెలుపు కూడా ఒక సంచలనం. 1953లో ఎం.హెచ్ విశాలాంధ్ర సంపాదకుడయ్యారు. సైద్ధాంతిక విభేదాల తర్వాత తనుగా ఆ బాధ్యతలకు రాజీనామా చేశారు. 1962, 1966లో ఆయనను రెండుసార్లు అరెస్టు చేసి జైళ్లలో పెట్టారు. 1964లో సిపిఎం రాష్ట్ర తొలి కార్యదర్శిగా ఎన్నికైన ఆయన తీవ్రవాద ఉద్యమ చీలిక కూడా చూశారు. ఎడాపెడా విచ్ఛిన్నాలనే పదం ఆయన నోట నిరంతరం వినిపించడానికి కారణమదే. ఈ రెండు సందర్భాలలోనూ ఉద్యమ పునర్నిర్మాణానికి కీలక బాధ్యత వహించారు. మొదట జనశక్తి తర్వాత ప్రజాశక్తి వారపత్రిక పున: ప్రారంభంలో సంపాదకుడుగా పేరు లేకపోయినా అన్ని కీలక విషయాల పైనా దిశానిర్దేశం చేసే రచనలందిస్తూనే వచ్చారు. 1974 నుంచి పెరిగిన కాంగ్రెస్ నిర్బంధానికి పరాకాష్టగా 1975 ఎమర్జన్సీ కూడా ఉద్యమానికి తీవ్ర సవాలు విసిరింది. అజ్ఞాతవాసంలో వుంటూనే

..6లో



నష్టాల్లో కొబ్బరి రైతులు

ఒకప్పుడు గోదావరి జిల్లాల్లో 'కొబ్బరి చెట్టు కొడుకు కన్నా మిన్న' అని పెద్దలు అంటూ ఉండేవారు. కొడుకులు చూసినా.. చూడకపోయినా ఇంటి వద్ద పది కొబ్బరి చెట్లు ఉంటే బతికేయవచ్చు అనే నమ్మకంతో గోదావరి ప్రజలు ఉండేవారు. అలాంటి వైభవం ఉన్న కొబ్బరి పంటను నమ్ముకున్న కొబ్బరి రైతులు నేడు నష్టాల్లో ఉన్నారు. ప్రపంచ కొబ్బరి ఉత్పత్తిలో భారతదేశం 3వ స్థానంలో ఉంది. మనదేశంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక తర్వాత ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో దాదాపు మూడు లక్షల 50 వేల ఎకరాల వరకు కొబ్బరి విస్తీర్ణం ఉంది. ప్రధానంగా సముద్ర తీరంలో ఉన్న కోనసీమ, ఉద్దానం ప్రాంతాల్లో అధిక విస్తీర్ణంలో ఉన్నా మెట్ట భూముల్లో కూడా కొబ్బరి విస్తీర్ణం అధికంగానే ఉంది. జాతీయ కోకోనట్ బోర్డు లెక్కల ప్రకారం రాష్ట్రం విస్తీర్ణంలో నాలుగో స్థానంలో ఉన్నా ఉత్పాదకతలో మొదటి స్థానంలో ఉంది. గత అనేక సంవత్సరాలుగా ఎర్ర నల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్ల ఆశించడంతో కొబ్బరి దిగుబడి బాగా తగ్గింది. మరోవైపు మార్కెట్‌లో ధరలు హెచ్చుతగ్గులుగా ఉండడం వల్ల కూడా కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కరోనా కాలం నుంచి కొబ్బరి రైతులు నష్టాలనే చవిచూస్తున్నారు. ఎకరా కొబ్బరి సాగుకు సంవత్సరానికి రూ.40 వేలకు

పైగా పెట్టుబడి ఖర్చులు అవుతున్నాయి. ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడంతో పంట ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయాయి. చెట్టు నుంచి కొబ్బరికాయలు కోసి గుట్టలుగా వేయడానికి ఒక్కో కాయకు రూ.3లు ఖర్చవుతుంది. అయితే వ్యాపారులు ఎండు కొబ్బరికాయకు రూ.6లకు మించి ధర ఇవ్వడం లేదు. 100 కొబ్బరికాయలు కొనుగోలు చేస్తే రైతు నుంచి అదనంగా పది కొబ్బరికాయలు వ్యాపారులు తీసుకుంటున్నారు. కొబ్బరి రైతుకు కోత ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉంది. వ్యాపారులు కొబ్బరి తోటల్లో పంట కొనుగోలు సందర్భంగా ఒక్కో కొబ్బరి చెట్టుకు గతంలో వెయ్యి రూపాయల వరకు ధర ఇచ్చేవారు. ఈ సంవత్సరం ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.550 నుండి రూ.700 వరకు ధర ఇస్తున్నారు. ఎకరా కొబ్బరి తోటలో 60 చెట్లు ఉండడంతో గతంలో ఎకరాకు రూ.60 వేలు ఆదాయం వచ్చేది. కొబ్బరి అంతర పంటగా కోకో ఇతర పంటలు సాగు చేయడంతో మరో రూ.30 నుండి 40 వేలు ఆదాయం వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. కష్టపడి రైతు నాణ్యమైన పంట పండించినా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. నష్టాలకు కొబ్బరికాయలు అమ్మకోలేక తోటలో నిల్వబెడితే వర్షాలకు తడిచి మొలకలు వచ్చేస్తున్నాయి.

కొబ్బరి రైతుల గోడును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. "అమ్మబోతే అడవి కొనబోతే కొరివి" అన్న చందంగా కొబ్బరి రైతుల పరిస్థితి తయారైంది. మార్కెట్‌లో వినియోగదారులు మాత్రం ఒక్కో కొబ్బరికాయను రూ.20 నుండి రూ.25లకు కొనుగోలు చేస్తున్నారు. కొబ్బరి మార్కెట్ ప్రయివేట్ వ్యాపారుల ఇష్టారాజ్యంగా తయారైంది. మార్కెట్ మాయాజాలంతో కొబ్బరి రైతులు నలిగిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు కొబ్బరికాయలు ఎగుమతి అవుతున్నాయి. వేసవికాలంలో కొబ్బరి బోండాలకు డిమాండ్ ఉంటుంది. పండుగల సమయంలో కొబ్బరికాయల వినియోగం అధికంగా ఉంటుంది. ప్రస్తుతం ఎండు కొబ్బరికి కూడా మార్కెట్‌లో డిమాండ్ ఉంది. మార్కెట్‌లో ధర ఎగుడు దిగుడులు సందర్భంగా అవసరమైతే నిల్వ చేసుకుని ధర పెరిగిన తర్వాత అమ్ముకునే అవకాశం రైతుకు లేదు. అందుకు తగిన గిడ్డంగులు గానీ, కోల్డ్ స్టోరేజ్‌లు గానీ అందుబాటులో లేవు. అనేక ఉత్పత్తుల్లో కొబ్బరి పంటను వినియోగిస్తున్నారు. కొబ్బరి పంట ప్రాంతాల్లో కొన్నిచోట్ల కొబ్బరి పీచు పరిశ్రమలు ఏర్పాటు చేశారు. కొబ్బరి ద్వారా తయారయ్యే మిగిలిన వివిధ ఉత్పత్తులకు సంబంధించిన తగిన పరిశ్రమలు లేవు. కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ ..14లో



ఉద్యమ బలం, గళం, కలం.. ఎంహెచ్

(ఐదు నుంచి)

ఎం.హెచ్ నాయకత్వం అందించారు. ఎమర్జన్సీ సెన్సార్‌షిప్‌లో కూడా సంజయ్ గాంధీ జాతరను అపహస్యం చేస్తూ 'అంజి' పేరిట ఆయన రాసిన 'రాజు వెడలె' సంచలనం తెచ్చింది. ఎమర్జన్సీ తర్వాత 1977 ఎన్నికలు, 1978లో శాసనసభ ఎన్నికలు అన్నిటా ఎం.హెచ్ ముందుండి పనిచేశారు. 1978లో శాసనమండలికి ఎన్నికైనారు. రాష్ట్రానికి తిరగివచ్చిన సుందరయ్య 1982లో రాష్ట్ర కార్యదర్శి అయ్యేవరకూ ఎం.హెచ్ 18 ఏళ్లపాటు బాధ్యతల్లో వున్నారు. 1953 నుంచి చివరి వరకూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడుగా వున్న ఆయన 1998లో పొలిట్‌బ్యూరో సభ్యులయ్యారు. ఈ విధంగా ఎం.హెచ్ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో విధాన నిర్ణయంలో ఆద్యంతం ఒక ముఖ్య పాత్రధారి. 1986 నుంచి ఆరేళ్లపాటు రాజ్యసభ సభ్యులుగా వున్నారు. మధ్యలో ఒకటి రెండు సార్లు అనారోగ్యం వెంటాడినా జాగ్రత్తలు తీసుకుని మళ్లీ బాధ్యతల్లోకి రావడం ఆయన దీక్షా దక్షతలకు నిదర్శనం.

ప్రజాశక్తి పురోగమనంలో...

1981లో ప్రజాశక్తి దినపత్రికగా మారినప్పుడు మళ్లీ అప్పటి నుంచి ఇరవయ్యేళ్లు 2001 దాకా నిర్విఘ్నంగా సంపాదక బాధ్యతలు నిర్వహించిన ఎం.హెచ్ అనారోగ్య కారణాల వల్ల వైదొలగారు. కమ్యూనిస్టు పత్రికలకు భవిష్యత్తు లేదనే అంచనాలు అధిగమిస్తూ పలు ఎడిషన్లతో విస్తరించిన ప్రజాశక్తి పెరుగుదలలో నేను, వి.కృష్ణయ్య, కొరటాల తదితరులతో పాటు పనిచేయడం ఒక మంచి అనుభవం. నిజానికి మా కమ్యూనిస్టు కుటుంబంలో నాన్న నరసింహయ్య, అమ్మ లక్ష్మమ్మలతో పాటు బాల్యం నుంచి ఆయన గళాన్ని, కలాన్ని అనుసరిస్తూ వచ్చిన నాకు ఆయనతో సహ సంపాదకుడుగా కొన్నేళ్లు పనిచేయడం, ప్రత్యక్షంగా దీర్ఘకాలం ఆయన సూచనలు అందుకోవడం గొప్ప అవకాశం. ఇప్పటికీ ఏ కీలక సందర్భం వచ్చినా ఎం.హెచ్ ఎలా స్పందించేవారు, ఎలా ఏమి రాసేవారు తప్పక స్ఫురిస్తుంది. నా 'వెయ్యేళ్ల చరిత్ర'ను ఎం.హెచ్‌కు అంకితం చేస్తూ గతాన్ని, వర్తమానాన్ని కూడా వర్గ దృష్టితో చూడటమెలాగో నేర్పించిన వ్యక్తిగా ఆయనకు జోహారులర్పించానందుకే. నాలాంటి నా ముందటి రెండు మూడు తరాల కార్యకర్తలందరికీ ఆయన చెరగని స్ఫూర్తి. కొత్త ఆలోచనలను ఆహ్వానిస్తూ యువతను కలుపుకుని పోతూ మౌలిక విలువలను నిలబెట్టడంలో ఆయన పట్టువిడుపులు అనుసరణీయం. వాస్తవానికి ఎం.హెచ్ జీవితం మలి దశలో మతోన్మాదం పెరుగుదల, సోవియట్ విచ్ఛిన్నం, సమాజంలో స్వార్థపూరిత అవకాశవాదం వెర్రితలలు వేయడం సరళీకరణ వంటివన్నీ ఎదుర్కొన్నారు. ఇన్ని బాధ్యతలలోనూ సమస్యలలోనూ కార్యకర్తల పట్ల, తోటి నాయకుల పట్ల, సిబ్బంది పట్ల ఎం.హెచ్ చూపిన ప్రేమాభిమానాలు చెరగని ముద్ర వేశాయి. ఆయన కుటుంబం మొత్తం ఆ విధంగానే ఉద్యమంతో నిలబడటం కూడా ఇందులో భాగమే, ఉదయం గారైతే అందరికీ అమ్మే. ఉద్యమంలో తప్పనిసరైన సమిష్టి తత్వానికి పరస్పరత్వానికి వారి ప్రేమాభిమానాలు తార్కాణాలు. 2001 జూన్ 18న ఆయన మరణానంతర కాలంలో మోడీ రాకడ, కరోనా సవాలు వంటివీ చూశాము. ఇన్నిటి మధ్యనా ప్రజాశక్తి ముందుకు పోవడం, రాష్ట్ర విభజన తర్వాత నవతెలంగాణ పత్రిక ఏర్పాటు...ఇవన్నీ ఎం.హెచ్, ఇతర పెద్దలు వేసిన పునాదిపై వెలసినవే. తర్వాతి కాలంలో ఉద్యమానికి, పత్రికకూ కూడా నాయకత్వం వహించిన బాధ్యులు, నాయకులు ఆ మార్గాన ముందుకు సాగుతున్నందుకే...ఈ రోజున కలుషిత వివాదాస్పద రాజకీయ వాతావరణంలోనూ ప్రజాశక్తి విభిన్న వరవడితో ప్రత్యేకత నిలబెట్టుకోగలుగుతున్నది. మీడియాలో చొరబడిన అనారోగ్యకర ధోరణులను, సాంకేతిక ఆర్థిక సవాళ్లనూ తట్టుకుని విశిష్టత చాటుకుంటున్నది. ఎం.హెచ్, ఆయనతో పాటు దీర్ఘకాలం పనిచేసిన బొమ్మారెడ్డి పేర్ల మీద బహూకరించే అవార్డులు అందుకు ప్రతీకలుగా వుంటాయి.

పామాయిల్ రైతు పరేషాన్

సగానికి పడిపోయిన గెలల ధర

పెరిగిన కౌలు, పెట్టుబడుల ఖర్చులు

ప్రజాశక్తి - చింతలపూడి

గతేడాది రూ.23 వేలు ఉన్న టన్ను పామాయిల్ గెలల ధర ప్రస్తుతం రూ.12,800కు పడిపోయింది. పెట్టుబడులు పెరిగాయి.. ఎరువులు, పురుగుల మందులు, కౌలు ధరలు పెరగటంతో నష్టం వాటిల్లుతుందని పామాయిల్ రైతులు వాపోతున్నారు. తామెలా బతకాలని దిగాలు చెందుతున్నారు. పామయిల్ పంట చేతికి రావటానికి నాలుగేళ్లు పడుతుంది. ఒక్కసారి పామాయిల్ పంట వేస్తే 23 సంవత్సరాల వరకు వేరే పంట వేయలేని పరిస్థితి. అంతర పంట వేయాలనుకున్నా మెట్ట ప్రాంతంలో అంతగా ఫలితాలు రాని పరిస్థితి ఉంది.

2022లో చింతలపూడి మండలంలో 7,594 హెక్టార్లలో పామాయిల్ పంట సాగు జరుగుతుందని, 2023 నాటికి సుమారు 9,500కుపైగా హైక్టార్లలో పంట సాగు జరుగుతుందని అధికారులు వెల్లడించారు. 2019 నుంచి పామాయిల్ రైతులకు మొక్కల రాయితీ పడలేదని, మొక్క రూ.193కు కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు తెగుళ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పురుగులు, ఎరువుల ధరలు పెరగడంతో సతమతమవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

ఏడాదిన్నర వ్యవధిలోనే పామాయిల్ గెలల ధర దాదాపు సగానికి పడిపోవడంతో నష్టపోతున్నామని, పామాయిల్ సాగు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వాలు నోటితో చెప్పి చేతల్లో చూపించడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించడంలో ఏ మాత్రం చొరవ చూపడం లేదని వాపోతున్నారు. పామాయిల్ గెలల ధర పతనాన్ని ఇప్పటికైనా ఆపకపోతే పూర్తిగా నష్టాల్లో కూరుకుపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పామాయిల్ సాగుకు ఎకరానికి రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుందని, అదనంగా కౌలు ఎకరాకు మరో రూ.లక్ష వరకూ ఉంటుందని రైతులు చెబుతున్నారు. సహజంగా పామాయిల్ పంట జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యలోనే దిగుబడి ఎక్కువగా ఉంటుందని, సీజన్‌లో నెలకు మూడు టన్నుల వరకూ దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని, వేసవిలో అది అర టన్నులోపే ఉంటుందని రైతులు చెబుతున్నారు. టన్నుకు రూ.23 వేల ధర ఉంటే పెట్టుబడి, కౌలుపోను ఎకరాకు రూ.2.3 లక్షల వరకు రైతుకు ఆదాయం వచ్చేది. ఇప్పుడు టన్ను ధర రూ.12,800కు పడిపోవడంతో ఎకరాకు సగటున రూ.లక్ష ఆదాయం రావడమే గగనంగా మారింది. దీంతో పెట్టుబడి వ్యయం, కౌలు వంటివి సమకూర్చుకోవడమే కష్టమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులకు పామాయిల్ ధరలు భారమవుతున్నాయనే ఉద్దేశంతో 30 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. అదే సమయంలో దేశంలో రైతులు నష్టపోతున్నారు. కనీస మద్దతు ధర అమలు చేయడానికి ప్రభుత్వాలు స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమను ఆదుకోవాలని పామాయిల్ రైతులు కోరుతున్నారు.

ధర తగ్గింది.. కౌలు, పెట్టుబడులు పెరిగాయి

ఆది ధర్మారావు, పామాయిల్ రైతు, శెట్టివారిగూడెం

2022 మే నెలలో టన్ను పామాయిల్ గెలల ధర సుమారు రూ.23 వేలు ఉండగా, 2023 జులైలో ఇది రూ.12,800కి తగ్గింది. ఏడాదిన్నర కాలంలో టన్నుకు రూ.10 వేలకు పైగా ధర తగ్గిపోయింది. కౌలు పెరిగింది. పెట్టుబడులు పెరిగాయి. అనేక పంటలు సాగు చేసి నష్టపోయిన తర్వాత పామాయిల్ సాగు చేస్తే కాస్త గట్టెక్కవచ్చని భావించాం. పంట వేసిన నాలుగేళ్ల వరకు ఆదాయం ఉండదు. అయినా పెట్టుబడులు పెట్టి తోటలు పెంచి, ఎదురుచూశాం. తీరా పంట వచ్చిన తర్వాత ధరలు పడిపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. రైతులందరం తీవ్రంగా నష్టపోతున్నాం. ధరలు స్థిరంగా లేకపోవడంతో పంట చేతికొచ్చేసరికి ఏమవుతుందోననే ఆందోళన పెరుగుతోంది.

సెప్టెంబర్‌లో రాయితీలు

మహ్మద్ షాఫీయా ఫర్హన్, ఉద్యానవనశాఖ అధికారి

రైతులకు రాయితీలు త్వరలో పడే అవకాశాలు ఉన్నాయి. సలహాలకు, సూచనలకు మమ్మల్ని సంప్రదించవచ్చు.

ఎప్పుడైతే జీవితంలో
భయం పోతుందో అప్పుడే
జీవితం ప్రారంభమవుతుంది.

\- చేగువేరా

వైసిపి హయాంలో బిసిలకు ప్రత్యేక స్థానం

సిటి మెడికల్ దుర్గారావు, చింతలపూడి నగర పంచాయతీ సచివాలయ కన్వీనర్

జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బిసిలకు ప్రత్యేక స్థానం ఇచ్చారు. బిసిలకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బిసిలకు వైసిపి హయాంలో మేలు జరుగుతుంది.

ప్రజల వద్దకే పాలన ఘనత వైసిపిదే

వెంపా కృష్ణ, వైసిపి చింతలపూడి గ్రామ నాయకులు

ప్రజల వద్దకు పాలన వైసిపి ప్రభుత్వం వల్లే సాధ్యమైంది. సచివాలయ వ్యవ స్థను తీసుకొచ్చి నూతన చరిత్రను సృష్టించారు. వైసిపి హయాంలో ప్రజలు అభ్యున్నతి చెందుతున్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం..!

రోడ్ల నిర్మాణానికి పటిష్ట చర్యలు
చివరిదశకు వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు
త్వరలో బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రారంభం
చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నో ఏళ్లుగా ముందుకు సాగని పనులు పూర్తి చేస్తూ, చింతలపూడి ప్రజల చిరకాల కోరికైన వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు ఎంఎల్ఎ ఎలిజా. ఒక నెల చింతలపూడిలో, ఒక నెల జంగారెడ్డిగూడెంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తన కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కార దిశగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో కొద్దిసేపు ముచ్చటించారు. ఆయన నియోజకవర్గాభివృద్ధికి చేపట్టిన చర్యల వివరాలిలా ఉన్నాయి.

చింతలపూడి నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 190 రోజులు దిగ్విజయంగా నిర్వహించాం. ఈ క్రమంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాను. ఆ సమస్యలు మళ్లీ పునరావృతమైతే అధికారులను సైతం ఉపేక్షించేది లేదని ఇప్పటికే హెచ్చరించాను.

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం.. ఒక నూతన చరిత్ర అధ్యయనానికి నాంది

'గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయి. వంద పడకల ఆసుపత్రి పలుమార్లు శంకుస్థాపనల వరకే పరిమితమైంది. ఈ ఆసుపత్రి గురించి ఎవరూ పట్టించుకోలేదు. నేను ఎంఎల్ఎగా ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణం నుంచి వంద పడకల ఆసుపత్రిపై దృష్టి పెట్టాను. ఆసుపత్రి నిర్మాణానికి నిధుల కోసం సిఎం జగన్‌ను ఒప్పించి, అప్పటి వైద్యఆరోగ్యశాఖమంత్రి ఆళ్ల నానిని రప్పించి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయించాను. ప్రస్తుతం ఆసుపత్రి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఆసుపత్రి ప్రారంభమైతే చింతలపూడి మండల పరిధిలోనే కాకుండా చుట్టుపక్కల మండలాల ప్రజలకు కూడా మెరుగైన వైద్యం అందుతుంది. తెలంగాణ, కృష్ణాజిల్లా వాసులకు కూడా ఈ వంద పడకల ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్రారంభానికి సిద్ధమవుతున్న బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల

ఎన్నో ఏళ్ల క్రితం ప్రారంభించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేయలేదు. గురుకుల పాఠశాలపై కలెక్టర్ మంత్రులతో చర్చించి నిధులు మంజూరు చేయించాను. రేకుల షెడ్డుల్లో మార్కెట్ యార్డులో విద్యాబోధన జరిగేది. ఈ విషయం తెలిసి గురుకుల పాఠశాల నూతన భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేశాను. పాఠశాల ప్రారంభానికి అడుగు దూరంలో ఉంది. త్వరలో నూతన భవనంలో విద్యాబోధన జరగనుంది. ఇది తల్లితండ్రులకు విద్యార్థులకు ఎంతో ఊరటనిచ్చే అంశం. సుమారు 470 మంది విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు అత్యున్నత వసతి సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎంఎల్ఎ ఎలిజా తెలిపారు. గురుకుల పాఠశాలను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

బోయగూడెం-సీతానగరం రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉండడంతో 108, ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించి రూ.20 కోట్లు మంజూరు చేయించానని ఎంఎల్ఎ ఎలిజా తెలిపారు. త్వరలో ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ రోడ్డు వెంబడి నాలుగు పంచాయతీల్లో ఆరు గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఇవేకాకుండా పలు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని, పనులు ప్రారంభం కావాల్సి ఉందని తెలిపారు. కేతవరం రోడ్డుకు రూ.1.95 లక్షలు, ఆసన్నగూడెం-వంతెనగుండేరు వాగు రోడ్డుకు రూ.86 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంఎల్ఎ తెలిపారు. నర్సన్నపాలెం రోడ్డు 6.5 కిలోమీటర్లకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. జంగారెడ్డిగూడెం-అంకమ్మకొల్లేరు రోడ్డులో జాగింగ్ పార్కుకు రూ.కోటి నిధులతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెంలో గత 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లను గుర్తించి రూ.15 కోట్లతో వాటి నిర్మాణం చేపట్టామని తెలిపారు. నాలుగేళ్ల కాలంలో రూ.25 కోట్లతో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టామని, నియోజకవర్గంలో రూ.20 కోట్లతో డ్రెయినేజీలు నిర్మించామని చెప్పారు. నియోజకవర్గంలోని పలు రోడ్లకు త్వరలో నిధులు మంజూరు కానున్నాయని తెలిపారు. బాలవారిగూడెం రోడ్డుకు రూ.4.40 కోట్లు, చింతలపూడి-టి.నరసాపురం రోడ్డుకు రూ.3 కోట్లు, దేశవరం-కెఎస్.నామవరం-కామవరపుకోట రోడ్డుకు రూ.23.30 లక్షలు, జీలకర్ర గూడెం-ఎఎస్.నామవరం-కామవరపుకోట రోడ్డుకు రూ.7.40 లక్షలు, ఆసన్నగూడెం-బాదరాల రోడ్డుకు రూ.1.80 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌ను కోరినట్లు తెలిపారు. సింగగూడెం-భోగోలు-తిమ్మక్కపాలెం రోడ్డుకు రూ.1.49 కోట్లు, రాజుపోతేపల్లి-అన్నపనేనివారిగూడెం రోడ్డుకు రూ.76 లక్షలు, భోగోలు-శంఖుచక్రపురం రోడ్డుకు రూ.1.55 లక్షల నిధులు మంజూరుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటాను

ఉన్నమట్ల ఎలిజా, చింతలపూడి ఎంఎల్ఎ

చింతలపూడి నియోజకవర్గంలో ఇప్పటివరకు 46 పంచాయతీల్లో 190 రోజులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించాం. 20 పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించటానికి అన్ని ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. గడపగడపకూ కార్యక్రమంలో ప్రజా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆపదని ఎవరొచ్చినా పార్టీలకు అతీతంగా సిఎం సహాయ నిధి నుంచి సాయం అందించేలా కృషి చేస్తున్నాం. ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్లకు పైగా సిఎం సహాయ నిధి అందించాం. అంతేకాకుండా మసీదులకు, ఆలయాలకు, చర్చిలకు, అంబేద్కర్ విగ్రహాలకు నా వంతు సాయం చేస్తున్నాను. చింతలపూడి నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు రుణపడి ఉంటాను. తన మీద నమ్మకంతో గెలిపించినందుకు కష్టపడి పని చేస్తున్నాను. త్వరలో నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను.

పంచాయతీ వ్యవస్థ - గ్రామ వాలంటీర్లు

గ్రామ స్థాయి నుండే పజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అందుకే రాజ్యాంగంలోని నలభయ్యవ అధికరణంలో స్థానిక స్వపరిపాలన ప్రాముఖ్యతను గురించి పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో మినహా దాదాపు అన్ని రాష్ట్రాల్లో పంచాయతీ వ్యవస్థను పాలకులు నిర్వీర్యం చేస్తూ వచ్చారు. వాటికి నిధులు, విధులు కేటాయించకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ పంచాయతీలను మరింత బలహీనం చేసింది. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ సకాలంలో పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కొంత తోడ్పడింది. అయితే ఎన్నికైన గ్రామ ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యతను పూర్తిగా తగ్గించివేసింది. మరోవైపు పంచాయతీలకు రావాల్సిన నిధులను రాష్ట్ర

ప్రభుత్వం వివిధ పథకాలకు మళ్లించుకుంటుంది. అందువల్ల పంచాయతీలు తమ కనీస విధులను నిర్వహించలేకపోతున్నాయి. కీలకమైన విషయాన్ని వదిలేసి సమస్యలన్నింటికీ వాలంటీర్లు మూలమైనట్లు, మహిళల అదృశ్యానికి వీరే కారణమైనట్లు జనసేన నేత మాట్లాడడం, వాలంటీర్లు వైసిపి ఏజెంట్లు అంటూ ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయబోమని చెప్పడం ద్వారా ఇప్పుడున్న వారిని తొలగించి తమ వారిని నియమించుకుంటామనే అర్థంలో మాట్లాడుతున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య మనుగడలో పంచాయతీ వ్యవస్థ స్ఫూర్తి, దాని పురోగతి అత్యంత కీలకమనే విషయాన్ని పాలక పార్టీలు ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నాయి.

పంచాయతీ వ్యవస్థ ఆవిర్భావం

స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, జిల్లా బోర్డులు అనే మూడంచల పాలన వ్యవస్థ ఏర్పడింది. గ్రామ పరిపాలన ప్రాధాన్యత గురించి మొదటి పార్లమెంట్ సమావేశాల్లోనే కమ్యూనిస్టులు లేవనెత్తారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో ముఖ్యంగా తెలంగాణలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటం ద్వారా ఏర్పడిన గ్రామస్వరాజ్య విధానం పాలకులు గ్రామ పరిపాలన అమలు చేసేటట్లు ఒత్తిడి చేసాయి. బల్వంతరాయ్ మెహతా ఆధ్వర్యాన పంచాయతీరాజ్ వ్యవస్థ పరిశీలన కోసం కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ సిఫార్సులతో 1959లో పంచాయతీ వ్యవస్థ ఏర్పడింది. దేశంలో మొట్టమొదటిసారి ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అలాంటి పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా పంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి. తెలుగు ప్రజలు గతంలో కొంత భాగం మద్రాసు రాష్ట్రంలో, మరికొంత నిజాం ప్రభుత్వంలో వుండడం వల్ల ఈ రెండు ప్రాంతాలకు రెండు పంచాయతీ చట్టాలు వుండేవి. మద్రాసు గ్రామ పంచాయతీ చట్టం-1950, హైదరాబాద్ గ్రామ పంచాయతీ చట్టం-1956 లను 1964లో రద్దు చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ చట్టం ఏర్పడింది. ఆ తర్వాత కొంత కాలానికి పంచాయతీ సమితులు, గ్రామ పంచాయతీల పనితీరు పరిశీలించిన అశోక్ మెహతా కమిటీ 1978లో తన సిఫార్సులు చేసింది. దాని ఫలితంగా 1986లో 330 పంచాయతీ సమితుల స్థానంలో 1096 మండల పరిషత్తులు ఏర్పడ్డాయి.

దేశవ్యాపితంగా స్థానిక స్వపరిపాలన పటిష్టంగా అమలు చేయడం కోసం 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా రాజ్యాంగంలో 9, 9ఎ విభాగాలను అదనంగా చేర్చారు. 11వ షెడ్యూల్ ద్వారా 29 అంశాలు నిర్వహించడానికి గ్రామ పంచాయతీలకు పూర్తి అధికారాలు ఇచ్చారు. దీనిద్వారా ప్రజలకు అవసరమైన ప్రాథమిక, కనీస సదుపాయాలు కల్పించడం, వాటిని నిర్వహించడం పంచాయతీల పరిధిలోకి వచ్చింది. గ్రామీణ వ్యవస్థ లోని భూస్వాములు, ధనిక రైతాంగం పంచాయతీ ఎన్నికలు జరగకుండా, తమ పెత్తనాన్ని కొనసాగించుకునేందుకు మొదటి నుండి ప్రయత్నించారు. అయితే సిపిఎం నాయకత్వంలో బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో ఏర్పడిన వామపక్ష ప్రభుత్వాలు పంచాయతీల ఎన్నికలకు, వాటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చాయి. గ్రామ సభలు నిరంతరం జరపడం ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధులకు పాలనలో నిజమైన భాగస్వామ్యం కల్పించారు. అందులో ప్రభుత్వ పథకాలకు అర్హుల ఎంపిక, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం, ప్రతి ఐదు సంవత్సరాలకు క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఆ రాష్ట్రాల బడ్జెట్ నుండి గ్రామ పంచాయతీలకు 30 నుండి 37 శాతం నిధులు కేటాయించేవారు. ఈ నిధులను గ్రామ పంచాయతీలకు బదిలీ చేయడం, వాటి ద్వారా ప్రజా సేవ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఆదర్శవంతమైన గ్రామపాలన అందించారు. అందుకే ఈ రాష్ట్రాల పంచాయతీలు దేశంలోనే కాదు ప్రపంచ మన్ననలు పొందాయి. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికలు నిర్దిష్ట గడువులో నిర్వహిస్తేనే కేంద్రం నిధులు విడుదల చేసే విధంగా నిబంధనలు మార్చాల్సి వచ్చింది. మంచి లక్ష్యంతో ఏర్పడిన పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రారంభం నుండి విధులు, నిధుల కొరతను ఎదుర్కోవలసి వచ్చింది.

వాలంటీర్ వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌లో జి.వో నెం: 104 ద్వారా 2019 ఆగస్టు 15న గ్రామ వాలంటీర్ వ్యవస్థ అమలులోకి వచ్చింది. ఈ వ్యవస్థ ద్వారా 'ప్రభుత్వ సంక్షేమ పథకాలను, సేవలను, కుల, మత, వర్గ, లింగ, రాజకీయ అనుబంధాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదార్లకు 'నవరత్నాల' రూపంలో చేరవేయడం లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయం అందులో పది మంది సిబ్బంది, 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో లక్ష 34 వేల మంది సచివాలయ సిబ్బంది, రెండు లక్షల 65 వేల మంది వాలంటీర్లు వచ్చినప్పటికీ గ్రామ పంచాయతీలు బలపడకపోగా, మరింత బలహీనపడ్డాయి. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు కొన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి నెల మొదటి తేదీన పింఛను అందించడం, పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, రైతుభరోసా, విద్యాదీవెన, విద్యా వసతి, గోరుముద్ద లాంటి పథకాల అమలులో సాంకేతిక అభ్యంతరాలను సరిదిద్దే ప్రయత్నం వాలంటీర్లు చేస్తున్నారు. ప్రతి చిన్న పనికి తహాశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే పాలనాపరమైన ఇలాంటి పనులు జరగడం మంచి విషయం. అయితే వాలంటీర్లలో అత్యధిక మంది అధికార పార్టీకి సంబంధించిన వారు కావడం, పాలనా పరమైన పనులన్నింటికీ వీరే కీలకంగా మారడంతో పంచాయతీ అధికారులు, ఎన్నికైన పంచాయతీ ప్రజా ప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మారారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ పెత్తనం పెరిగింది. ప్రతి కుటుంబం గురించి ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితుల వివరాలు ఈ వాలంటీర్ల దగ్గర వుండడం వల్ల ప్రజలను భయపెట్టడం, అవినీతికి, అనైతిక పనులకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్, భూమి వివరాల లాంటి సమగ్ర సమాచారం ఈ వాలంటీర్ల వద్దకు చేరింది. ఈ సమాచారానికి భద్రత ఎంత?

పంచాయతీలు నిర్వీర్యం

గ్రామాల్లో వీధిలైట్లు, మంచినీటి కొళాయిల ఏర్పాట్లు, కాలవల మరమ్మతులు, చెత్త శుభ్రం చేయించడం లాంటి రోజువారీ పనులకు కూడా పంచాయతీల వద్ద నిధులు లేవు. ప్రభుత్వం

..12లో

ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా తెలుగు ప్రచురణ రంగం

1953 జనవరి 1న విజయవాడలో ప్రారంభమైన 'విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్' సంస్థ అభ్యుదయ సాహిత్య ప్రచురణకు, వ్యవహారిక భాషా ప్రచారానికి నడుం కట్టి దఫదఫాలుగా అసంఖ్యాక ప్రచురణలను వెలువరించింది.

ఏ భాషలోనైనా ప్రచురణ పరిపుష్టంగా ఉంటేనే ఆ భాషా సాహిత్యాలు, సంస్కృతి చిరస్థాయిగా, ప్రామాణికంగా ఉంటాయి. పుస్తక విక్రేతలు, పాఠకులు, ప్రచురణ రంగానికి ఆయువుపట్లు. మన ఆంధ్రదేశ స్థాయిలో అవలోకిస్తే మద్రాసు తదితర ఇతర ప్రాంతాల్లో గ్రాంథిక తెలుగులో పలురకాల తెలుగు పుస్తకాలు వెలువడినప్పటికీ, క్రిష్టియన్ మిషనరీలు తమ మత ప్రచారానికి 1811 అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం, బళ్లారి, విశాఖపట్టణంలో ప్రచురణ సంస్థలు ప్రారంభించాయి. ఆంధ్రదేశం వెలుపలనే పలు ప్రచురణ సంస్థలు భిన్నభిన్న తరహాల పుస్తకాలను ప్రచురించాయి. స్వాతంత్రోద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో ఆంధ్రదేశంలో కూడా తెలుగు ప్రచురణలు వెలువడడం ప్రారంభమయ్యాయి.

1940లో కృష్ణా జిల్లా పటమటలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం నిర్వాహకులు, రాజమండ్రిలో ఆంధ్రబుక్ డిపో వారు, 1908లో బందరులో ఆంధ్రభాషాభివృద్ధి గ్రంథమాల వారు, 1920లో విజయవాడలో మారుతీరామ్ అండ్ కంపెనీ వారు ఈ తరహాలో ఆంధ్రదేశంలో పలు ప్రాంతాల వారు తెలుగులో పుస్తకాల ప్రచురణలను ప్రారంభించారు. 1931లో గద్దె లింగయ్య విజయవాడలో స్థాపించిన ఆదర్శ గ్రంథమండలి బొందలపాటి శివరామకృష్ణ 1943లో ప్రారంభించిన దేశ కవితా మండలి మొదలైనవి విజయవాడలో పుస్తక ప్రచురణను ముమ్మరం చేశాయి. 1948లో వెంకట్రామ అండ్ కంపెనీ విజయవాడలో ప్రారంభమై విద్యావిషయక గ్రంథాలను విరివిగా ప్రచురించింది. అనతికాలంలోనే వివిధ అంశాల మీద అసంఖ్యాక పుస్తకాలు ప్రచురించి సర్వ తెలుగు పుస్తక విక్రేతలుగా ప్రసిద్ధి పొందారు. 1950లో విజయవాడలో స్థాపించిన నాస్తిక కేంద్రం వారు నాస్తికవాదం, హేతువాద, ప్రచార నిమిత్తం పుస్తకాలను ప్రచురించి తమదైన నూతన ఒరవడిని సృష్టించారు. 1951లో శ్రీనివాస చక్రవర్తి సాహితీ పబ్లికేషన్స్‌ను స్థాపించి సాహిత్యరంగాలకు సంబంధించిన వివిధ ప్రచురణలను వెలువరించారు. 1953లో అన్యభాషా సాహిత్య ప్రక్రియలను తెలుగు లోకి తీసుకువచ్చి సంచలనాన్ని పురిగొల్పిన ప్రేమ్‌చంద్ పబ్లికేషన్స్ చిరస్మరణీయ సంస్థగా విజయవాడ ప్రచురణ రంగంలో స్థానం సంపాదించుకుంది. ఈ సంస్థ అధినేత కెఎస్ఎస్ శాస్త్రి ప్రేమ్‌చంద్ శాస్త్రిగా ఘనకీర్తి గడించారు.

విజయవాడ పుస్తక ప్రచురణరంగంలో 1953వ సంవత్సరం సరికొత్త అభ్యుదయ మలుపుకు నాందీవచనం పలికింది. 1953 జనవరి 1న విజయవాడలో ప్రారంభమైన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంస్థ అభ్యుదయ సాహిత్య ప్రచురణకు, వ్యావహారిక భాషా ప్రచారానికి నడుం కట్టి దఫదఫాలుగా అసంఖ్యాక ప్రచురణలను వెలువరించింది. తెలుగు పాఠకులనూ అసంఖ్యాకంగా పెంచుతూ భిన్నభిన్న రంగాల పఠనీయ రుచులను పరిచయం చేసింది. అంతకు పూర్వం తెలుగులోకి రాలేని గురజాడ, గిడుగు ప్రభుతుల రచనలను సాహితీ పాఠకుల సాన్నిహిత్యానికి తెచ్చింది. అంతేకాదు, ప్రపంచఖ్యాతి గడించిన అన్య దేశీయ భాషల ప్రముఖ రచయితల గ్రంథాలను తెలుగు అనువాదాలుగా వెలువరించి తెలుగు ప్రచురణ రంగాన్ని విస్తృతపరిచింది. ఇంతటితో ఏ మాత్రం తృప్తిపడక ప్రచురణను పాఠకుల చెంతకు తీసుకువెళ్లడంలో, పఠనీయతను పెంపొందించడంలో అవిరళ కృషి చేసింది. ఈనాటికీ అగ్రగామి ప్రచురణ సంస్థగా వెలుగొందుతోంది. ఈ మధ్య కాలంలోనే కృష్ణా జిల్లా పరిధిలోనే పలు ప్రచురణ సంస్థలు ప్రారంభమై విజయవాడలో బ్రాంచీలను ప్రారంభించాయి. ఎం శేషాచలం అండ్ కంపెనీ వారు తెలుగు ప్రచురణ రంగంలో వినూత్న విప్లవాన్ని సృష్టించి, ఇంటింటికీ భిన్నభిన్న పఠనీయ గ్రంథాలను సరఫరా చేస్తూ పాఠకుల అభిరుచిని ఎంతగానో పెంచారు. ఈ సంస్థ ఎమెస్కో సంస్థగా రాష్ట్రంలోనేగాక రాష్ట్రేతర ఆంధ్రుల్లో కూడా సాహిత్యాభిలాషను పెంపొందించింది. 1957లో విజయవాడలో నవోదయా పబ్లిషర్స్ స్థాపితమైంది. ఈ సంస్థ 1960 నుండి రామమోహనరావు నేతృత్వంలో అప్రతిహతంగా సాహిత్య ప్రచురణలు చేపట్టింది. ఈషణ్మాత్రం ముద్రారాక్షసాలు లేకుండా ముచ్చటగొల్పే ప్రింటింగ్ టెక్నాలజీ, బైండింగ్‌లతో ఆయన వెలువరించిన గ్రంథాలు యువ పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బాల సాహిత్యరంగ ప్రచురణలలో వినూత్న మార్పులను తీసుకువచ్చారు. ఆయన ఆంధ్రదేశంలో నవోదయ రామ్మోహనరావు గానే లబ్ధప్రతిష్టులయ్యారంటే ఆయన తెలుగు ప్రచురణరంగం ఇతోధిక అభివృద్ధికి చేసిన అవిరళ కృషిని ఎవరూ విస్మరించలేరు.

తదనంతర కాలంలో విజయవాడలో స్థాపితమైన నవభారత్ బుక్ హౌస్, జయంతి పబ్లికేషన్స్, పల్లవి పబ్లికేషన్స్, ప్రజాశక్తి, అలకనంద ప్రచురణలు మొదలైన ప్రచురణ సంస్థలు తెలుగువారి పాఠకాభిరుచిని ఎంతగానో పెంచాయి. రచయితలు, కవులు సంఖ్యాపరంగా హైదరాబాదు తదితర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ప్రముఖ ప్రచురణ సంస్థలు అనేకం విజయవాడలోనే నెలకొలనడం విశేషం. ఇందుకుగల ప్రధాన కారణాల్లో ఒకటి ముద్రణ, బైండింగ్ తదితర సాంకేతిక సౌకర్యాలు పుష్కలంగా ఉండడం, కొంత సౌలభ్యంగా ఉండడం, పేరెన్నికగన్న పత్రికలకు హైదరాబాద్ నగరం కేంద్రస్థానమైనప్పటికీ తెలుగు ప్రచురణరంగంలో భిన్నభిన్నపుస్తకాల ఆవిష్కరణ విజయవాడలో జరుగుతుండడం గమనార్హం. ముఖ్యంగా నాన్‌ఫిక్షన్ పుస్తకాలకు విజయవాడ ప్రచురణ రంగమే కీలకమైందిగా రూపొందింది.

రాష్ట్రస్థాయిలో పుస్తక పరిశ్రమ విజయవాడలోనే దాదాపు 70 శాతం కేంద్రీకృతమై ఉన్నదంటే అతిశయోక్తి కాబోదు. ఆంధ్రదేశంలో అక్షరాస్యత ఉద్యమ ప్రభావానికి విజయవాడ పుస్తక ప్రచురణ రంగం గణనీయంగా దోహదపడింది. కాలక్రమంలో ప్రచురణ సంస్థలతో పాటు పులువురు సాహిత్యకారులు, సాహితీ సంస్థలు, రచయితలు స్వయంగా ప్రచురణ బాధ్యతలను చేపట్టి విజయవాడ ప్రచురణరంగాన్ని తమవంతు

బలోపేతం చేశారు. తెలుగు పాఠకలోకంలో లబ్ధప్రతిష్టులైన ఎంతోమంది రచయితల ఫిక్షన్, నాన్‌ఫిక్షన్ గ్రంథాలు విజయవాడ నుండి ప్రచురితం కావడం మనకు గర్వకారణం.

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

అక్షరాక్షర దీక్షగా మున్ముందుకు..

ప్రజాశక్తి నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకుని 43వ వార్షికోత్సవం జరుపుకొంటున్న సమయం. అక్షరాక్షర దీక్షగా / ఆశయాలే రక్షగా / నడచి వచ్చిన దారులు / గడిచిపోయిన రోజులు...ఈ సందర్భంలో కళ్ల ముందు కదలాడతాయి. దానితో సన్నిహిత సంబంధం, భాగస్వామ్యం ఉన్న వారికి పత్రిక చరిత్ర, పెరుగుదల కళ్ల ముందు కదలాడతాయి.

తెలుగులో పత్రికలు ప్రధానంగా సంఘ సంస్కరణలు, స్వాతంత్ర్య పోరాటం, వామపక్ష ఉద్యమాలు అన్న మూడు నేపథ్యాలలో తొలి అడుగులు వేశాయి. 1942లో ప్రజాశక్తి వార పత్రికగా ప్రారంభమైంది. ఆ విధంగా చూస్తే ఇది ఎనభై ఒకటవ వార్షికోత్సవం కూడా. ఫాసిస్టు యుద్ధాన్ని ఖండించడం లోను, ప్రగతిశీల భావాలను వ్యాపింపచేయడంలోనూ నాటి ప్రజాశక్తి కీలక పాత్ర వహించింది. 1945లో దినపత్రికగా మారింది. సుందరయ్య, కంభంపాటి, మద్దుకూరి వంటి వారి కృషి ఇందులో ఉంది. శ్రీశ్రీ, కొకు, ఉప్పల వంటి సుప్రసిద్ధుల రచనలు దానిలో వచ్చేవి. గ్రాంథికం, వ్యవహారం, వాదోపవాదాల మధ్య పత్రికా భాష ఇంకా పూర్తిగా స్థిరపడని ఆ కాలంలో జన సామాన్యానికి అర్థమయ్యే విధంగా రాయడంలో ప్రజాశక్తి భాషకు ఒరవడి, భావాలకు ఒరిపిడి అయింది. ఇది నచ్చని ఛాందసులు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్-ప్రజాశక్తి పాస్' అని అపహాస్యం చేశారు కూడా! 1946లో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రజాశక్తి వాణిగా పనిచేసింది. ప్రభుత్వం 1948లో ప్రజాశక్తి నగర్‌పై దాడి చేసి, విధ్వంసానికి పాల్పడింది. మళ్లీ ఆరేళ్లకు 1951లో వారపత్రికగా పున:ప్రారంభమైంది. కొన్నాళ్ళ తర్వాత దినపత్రికగా మారినా నాడు విశాలాంధ్ర కోసం జరుగుతున్న పోరాటాన్ని దృష్టిలో ఉంచుకుని పత్రికకు కూడా అదే పేరు పెట్టారు. మద్దుకూరి చంద్రం, మోటూరు హనుమంతరావు తదితరులు దాని సంపాదకులుగా ప్రసిద్ధులు. ప్రజాశక్తి 1968లో వారపత్రికగా 1981 ఆగస్టు ఒకటో తేదీన దినపత్రికగా అవతరించింది. మోటూరు హనుమంతరావు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య సమక్షంలో నాటి సిపిఎం కార్యదర్శి ఇఎంఎస్ నంబూద్రిపాద్ దాన్ని ఆవిష్కరించడం ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నట్టుంది. చాలా మంది ఈ పత్రిక నడవటం కష్టమని మాతోనే అనే వారు. కాని సందేహాలు పటాపంచలు చేస్తూ అక్షరాయుధంగా పదునెక్కుతూ ప్రజాశక్తి ప్రస్థానం నడిచింది. అంకిత భావం గల నాయకత్వం, పాత్రికేయులు, కార్మికులు సిబ్బంది సేవలు, ఉద్యమాభిమానులు పత్రిక శ్రేయోబిలాషుల అండదండలు దాన్ని నిలబెట్టాయి. ఒకప్పుడు వాటిని మెయిన్ స్ట్రీమ్ పత్రికలనీ, ప్రజాశక్తి వంటి వాటిని వామపక్ష పత్రికలనీ అనేవారు. అయితే ఇప్పుడు ప్రజాశక్తి వంటివి మెయిన్ స్ట్రీమ్ కాగా చాలా పత్రికలు ఆయా పాలక పార్టీల స్ట్రీమ్‌లుగా, స్టీమ్‌లుగా మారాయి. ఈ పరిస్థితుల్లో విశ్వసనీయత, స్వతంత్రత, నిష్పాక్షికతలకు కట్టుబడి ప్రజల పక్షంగా యథార్థాన్ని ఆవిష్కరించే బాధ్యత పూర్తిగా మోస్తున్నది ప్రజాశక్తి వంటి పత్రికలే. అందుకే ప్రజలు వీటిని ఆదరిస్తారు, గౌరవిస్తారు. అయితే రానురాను ఈ సవాళ్లు తీవ్రమవుతాయే గాని తగ్గవు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మీడియా అనేది పాలకులకు సింహస్వప్నంగా వుంది. మోడీ అధికారం లోకి రావడానికి ఉపయోగించుకున్న సోషల్ మీడియానే ప్రజాస్వామిక వాదులు ఉపయోగించుకుంటే అపరాధమైపోతున్నది. సుప్రీం కోర్టు ముందు మీడియాకు సంబంధించిన కేసులు ఎన్ని వున్నాయో చెప్పడం కష్టం. ఇలాంటి సమయంలో కాలపరీక్షకు నిలిచిన ప్రజాశక్తిని పటిష్టం చేసుకోవడం, మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతైనా అవసరం. ఆలోచనా పరులు ఎవరైనా పాలకపక్ష మీడియా పోకడలకే కొట్టుకుపోవడంగాక ప్రత్యామ్నాయ, ప్రజాస్వామిక సమాచార స్రవంతిగా ఆశయాలకు ఆలవాలంగా ముందుకు సాగుతున్న ప్రజాశక్తిని తమదిగా భావించాలి. ఎంతో జటిలమైన గత సవాళ్లను అధిగమిస్తూ నాలుగు దశాబ్దాలను దాటి ముందుకు నడిచిన ప్రజాశక్తి చరిత్రకు తోడు ఇప్పుడు ఎందరో కొత్త శక్తుల చేరిక, చైతన్యవంతమైన ఉద్యమాల కదలిక అందుకు విశ్వాసమిస్తుంది.

పంచాయతీ వ్యవస్థ - గ్రామ వాలంటీర్లు

(పదోపేజీ నుంచి)

ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో అత్యధిక సర్పంచులు అధికార పార్టీ వారే అయినప్పటికీ ఆందోళనలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థమవుతుంది.

రాష్ట్రంలో మూడున్నర కోట్ల గ్రామీణ ప్రజలకు 12,918 మంది సర్పంచులు ప్రతినిధులుగా వున్నారు. పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం ద్వారా 2018-19లో రూ.1729.23 కోట్లు, 2019-20లో రూ.2,336.5 కోట్లు వచ్చాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా 2020-21లో రూ.2,625 కోట్లు, 2021-22లో రూ.1,939 కోట్లు...మొత్తం రూ.8,629.73 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు మళ్లించింది. సిఎంఎఫ్ఎస్ అకౌంట్ల నుండి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ నిధులను మళ్లించుకుంటుంది. కేంద్ర ఆర్థిక సంఘం నుండి 2022-23, 2023-24 సంవత్సరాలకు వచ్చిన రూ.4,041 కోట్ల నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తన దగ్గర నిలుపుకుంది. అంతేకాకుండా రిజిస్ట్రేషన్లపై పంచాయతీలకు ఈ సంవత్సరం జనవరి నుండి రావలసిన స్టాంపు డ్యూటీ వాటా సుమారు నాలుగు వేల కోట్లు ఇవ్వడంలేదు. నిధుల కొరతతో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం అవుతుంటే...9 వేల కోట్లతో 35 వేల సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు కట్టడంవల్ల ఏం ఉపయోగం? పంచాయతీ వ్యవస్థను బలహీనం చేసి అధికార యంత్రాంగం ద్వారా, తమ పార్టీ కార్యకర్తల ద్వారా పరిపాలిస్తున్నారు. దేశంలో అమలవుతున్న వినాశకర ఆర్థిక విధానాల కేంద్రీకృత పాలన లక్ష్యంగా వున్నాయి. రాష్ట్రంలో అమలవుతున్న ఈ చర్యలన్నీ అందులో భాగమే. ఇప్పటికే రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో వున్న విద్య, వ్యవసాయం, విద్యుత్, ప్రాథమిక ఆరోగ్యం, మంచి నీటి సరఫరా లాంటి వాటన్నింటిలో కేంద్ర పెత్తనం పెరిగింది. ఈ రంగాలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం చట్టాలు రూపొందిస్తుంది. తమ హక్కులు హరించుకుపోతుంటే ప్రశ్నించలేని రాష్ట్ర ప్రభుత్వం హక్కుల రక్షణ కోరుతున్న సర్పంచులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. ప్రజల చెంతకే పాలన అంటే భవనాలు కట్టడం, తాత్కాలిక సిబ్బందిని పెంచడం కాదు, స్థానిక సంస్థలకు నిధులు పెంచి వాటి ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. కేరళలో 2018లో వచ్చిన వరదలు, ఆ తర్వాత వచ్చిన కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యం ప్రపంచాన్ని ఆకర్షించిందంటే దానికి కారణం అక్కడవున్న పటిష్టమైన పంచాయితీ వ్యవస్థ. మన రాష్ట్రంలో నిజంగా పాలన వికేంద్రీకరణ విధానం అమలు కావాలంటే వాలంటీర్ల వ్యవస్థను పంచాయతీ పాలన కిందకు తెచ్చి ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా గ్రామ సభలు జరపడం, అక్కడ ప్రణాళికలు రూపొందించడం, వాటి అమలుకు సరిపడా నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించడం, అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం జరగాలి.

అప్పలరాజుగూడెం వద్ద రోడ్డు దుస్థితి

అధ్వానంగా ఉన్న పుట్రేపు రోడ్డు

మక్కినవారిగూడెం - మద్రిగూడెం రోడ్డు

ఈ రోడ్లపై ప్రయాణం.. ప్రాణ సంకటమే..!

అడుగడుగునా గోతులు.. వాహనదారులకు కష్టాలు

ఏళ్లు గడుస్తున్నా మారని దుస్థితి

పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలో రోడ్లపై ప్రయాణం వాహన దారులకు, ప్రయా ణికులకు ప్రాణసంకటంగా మారింది. ప్రధానంగా బండివారిగూడెం-అప్పలరా జుగూడెం, పుట్రేపురోడ్డు, టి.నరసాపురం ప్రధాన సెంటర్ నుండి బంధంచర్ల, మక్కిన వారిగూడెం-మద్రిగూడెం, మక్కి నవారి గూడెం-కొల్లివారిగూడెం, టి.నరసా పురం-మక్కినవారిగూడెం ఇలా ఆర్అండ్బి, పంచాయతీరాజ్ రోడ్లన్నీ సుమారు పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఫలితంగా ఆయా రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతోపాటు రోడ్డుపై రాళ్లు లేచి కనీసం నడవడానికీ ఇబ్బందికరంగా మారాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని, ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రం కావడంతో పెద్ద వాహనాలు సైతం గోతుల్లో దిగబడిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో బస్సు సర్వీసులను సైతం రద్దు చేస్తున్నారని, ఆ సమయాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని జనం వాపోతున్నారు. ఏళ్ల తరబడి రోడ్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకున్న నాథుడే లేడని పలువురు విమర్శిస్తున్నారు. రోడ్ల అధ్వానంపై ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు రోడ్లు అభివృద్ధి చేయాలని 'స్పందన'లో ఫిర్యాదు చేసినా అధికారులు, పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్ల దుస్థితితో విసుగెత్తిపోతున్న ప్రజలు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లోకి నాయకులొస్తే నిలదీయాలని చూస్తున్నట్లు వారు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుట్రేపు, బండివారిగూడెం, మక్కినవారిగూడెం తదితర రోడ్లన్నీ అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పన్నెండేళ్లుగా పుట్రేపు రోడ్డు అధ్వానం

మండలంలోని టి.నరసాపురం-మక్కినవారిగూడెం అడ్డరోడ్డు నుండి పుట్రేపు, ప్రకాష్నగర్, రుద్రకోట రాజుగూడెం, కాపుగూడెంలను కలు పుకుని బండివారిగూడెం వరకు 3.9 కిలో మీటర్ల మేర ఉన్న పంచాయతీరాజ్ రోడ్డును 2008లో అప్పటి ప్రభుత్వం రూ.కోటీ 50 లక్షల నిధులతో బిటి రోడ్డుగా అభివృద్ధి చేసింది. అయితే రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు లోపించ డంతో ఆనతికాలంలోనే రోడ్డు దెబ్బతింది. 2014లో కాంట్రా క్టుదారులు తూతూమంత్రంగా మరమ్మతులు చేసి రూ.29.25 లక్షలు బిల్లులు చేయించుకున్నారు. అయితే రోడ్డు తిరిగి మరమ్మతుకు గురికావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు మొదలయ్యాయి. నాటి నుండి నేటి వరకు అభివృద్ధి విషయంలో పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవని పలువురు వాపోతున్నారు. రోడ్డు అభివృద్ధి కోరుతూ సిపిఎం, పలు ప్రజాసంఘాల నాయకులు ఆందోళనలు నిర్వహించారు. పలుమార్లు స్థానికులు 'స్పందన'లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అభివృద్ధి చేస్తామని అధికారులు చేతులు దులుపుకున్నారే తప్ప నేటికీ పట్టించుకున్న దాఖలాల్లేవని గ్రామస్తులు వాపోతున్నారు.

గతుకుల మార్గం.. బండివారిగూడెం-అప్పలరాజుగూడెం రోడ్డు

మండలంలోని బండివారిగూడెం నుండి అప్పలరాజుగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం మండలం లక్ష్మీపురం బైపాస్కు కలిపే ఆర్అండ్బి రహదారి సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర ఉంది. దీనిగుండా పుట్రేపు,

..14లో

పుట్రేపు రోడ్డు దుస్థితిపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న జనం



ఈ రోడ్లపై ప్రయాణం.. ప్రాణ సంకటమే..!

(13వ పేజీ నుంచి)

రుద్రకోటరాజుగూడెం, టి.నరసాపురం, మక్కినవారిగూడెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు, వాహనదారులు జంగారెడ్డిగూడెం, రాజమండ్రి వంటి ప్రాంతాలకు వాహనాలపై వెళ్లొస్తూ ఉంటారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా నుండి కూడా కొన్ని వాహనాలు ఈ మార్గం గుండా వెళ్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో బండివారిగూడెం నుండి అప్పలరాజుగూడెం మధ్యలో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడి అధ్వానంగా మారింది. భారీ వాహనాలు తిరుగుతూ ఉండటంతో గోతులు చెరువులను తలపిస్తున్నాయి. కొన్నిసార్లు వాహనాలు గోతుల్లో దిగబడి ఆటంకంగా మారుతున్నాయి. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును అధికారులు తక్షణం అభివృద్ధి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మక్కినవారిగూడెం-మర్రిగూడెం రోడ్డు మాటేమిటో..!

మక్కినవారిగూడెం నుండి గిరిజన పంచాయతీ మర్రిగూడెం పంచాయతీలో గ్రామాలన్నింటినీ కలుపుకుని ఉన్న ఆర్అండ్‌బి రోడ్డు గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. పూర్తి గిరిజన ప్రాంతంగా ఉన్న ఈ గ్రామాల ప్రజలు నిత్యం వైద్యం ఇతర అవసరాలకు మక్కినవారిగూడెం, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో రోడ్డు అధ్వానంగా ఉండటంతో బస్సు సౌకర్యం లేదని, ఆటో వంటి వాహనాలు రాక ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు చెబుతున్నారు.

'స్పందన'లో ఫిర్యాదు చేసినా పరిష్కారం లేదు

బాణాల నాగేంద్ర, పుట్రేపు

మండలంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే ఏం ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తోంది. పుట్రేపు రోడ్డును అభివృద్ధి చేయాలని ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశాను. అధికారులు వచ్చి రోడ్డు వేస్తామని నాతో ఫొటో దిగారు. ఇది జరిగి ఏళ్లు గడుస్తున్నా రోడ్డు వేయలేదు. పాలకులు స్పందించాలి. రోడ్డు అభివృద్ధి చేయాలి.

మండలంలో రోడ్లన్నీ అభివృద్ధి చేయాలి

నంబూరి నాగేంద్ర, పుట్రేపు

మండలంలోని పుట్రేపు రోడ్డుతోపాటు బండివారిగూడెం, మక్కినవారిగూడెం రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా అధికారులు అభివృద్ధి చేయడం లేదు. ప్రభుత్వాలు మారినా రోడ్ల పరిస్థితి మారలేదు. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాలి.

ప్రజలకు అన్నివిధాలా మేలు

మిర్యాల దిలీప్, వైసిపి చింతలపూడి మండల నాయకులు

అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతంలో ప్రజలు ప్రతి చిన్న పనికి అధికారులు, నాయకుల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా ప్రజల ఇంటి వద్దకే అన్ని సేవలు అందుతున్నాయి. వైసిపి హయాంలో ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేకూరుతోంది.

నష్టాల్లో కొబ్బరి రైతులు

(ఆరో పేజీ నుంచి)

పథకాన్ని ప్రవేశపెట్టినా కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు తగిన చర్యలు ఎక్కడా చేపట్టలేదు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఆదాయం, యువతకు ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది. ఆ విధంగా ప్రభుత్వాలు ఆలోచనలు చేయడం లేదు. కొబ్బరి వలుపు, దింపుడు కార్మికులు వేల సంఖ్యలో ఉపాధి పొందుతున్నారు. కొబ్బరి రైతు నష్టాల ప్రభావం వీరి కనీస వేతనాలపై ఉంటుంది. కొబ్బరి రైతు పెట్టిన పెట్టుబడికి కనీసం మార్కెట్‌లో ఒక్కో కాయకు రూ.15 లు ధర ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అయితే మార్కెట్‌లో వ్యాపారులు ఆ ధర ఇవ్వడం లేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. మన రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.3 వేల కోట్లు ధరల స్థిరీకరణ నిధి పథకానికి కేటాయిస్తుంది. రాష్ట్ర బడ్జెట్ ప్రసంగాల్లో చాలా గొప్పగా చెబుతున్నారు. విత్తనం నుండి విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని ప్రచారం ఊదరగొడుతున్నారు. ఆచరణలో అమలు లేదు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ రంగంలోకి దిగి రైతుల నుండి కొబ్బరికాయలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నా పట్టించుకునే పరిస్థితి కనబడడం లేదు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల సందర్భంగా రాష్ట్ర ఎంపీలు కొబ్బరి రైతుల గోడు వినిపించి కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేసే విధంగా ఎక్కడా కానరావడం లేదు. 2020- 21 సంవత్సరాన్ని మాత్రం కొబ్బరి సంవత్సరంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి మాత్రం చర్యలు లేవు. ఉద్యాన శాఖ ద్వారా వీరికి సబ్సిడీ పథకాలు అమలు కావడం లేదు.

ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేసి ఒక్కో కొబ్బరికాయకు కనీస ధర రూ.15లు ఇవ్వాలి. కొబ్బరి అధికంగా పండించే ప్రాంతాల్లో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులు కొబ్బరి పంట అమ్ముకుని కనీస ధరలు పొందే విధంగా తగు చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో ఉన్న కొబ్బరి రైతులు ఐక్యంగా పోరాడితే గానీ ప్రభుత్వాలు స్పందించే పరిస్థితి లేదు. సమస్యల పరిష్కారానికి కొబ్బరి రైతులందరూ సంఘటితం కావడమే ఇందుకు పరిష్కారం.

– కె.శ్రీనివాస్

పోలవరం పునరావాసం కోసం...

పోలవరం ప్రాజెక్టు చాలా సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రధాన ఎజెండాగా వుంది. ఇది బహుళార్థక సాధక ప్రాజెక్టు అని సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి తద్వారా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని ప్రచారం చేశారు. ప్రాజెక్టుని మా హయాంలో పూర్తిచేస్తామంటే మా హయాంలో ప్రారంభిస్తామని గొప్పలకు పోయి మరీ మాట్లాడడం మనం చూస్తున్నాం. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వాలు, ప్రధాన ప్రతిపక్షాలు చెప్పింది చెబుతున్నది....ప్రాజెక్టు ఎత్తు, పొడవు, వాలు, డ్యామ్ నిధులు...వీటి గురించే. కానీ నేడు చర్చించాల్సింది సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల గురించి.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని సి.పి.యం ఆధ్వర్యంలో జూన్ 20వ తేదీ నుండి జులై 4 వరకు చేపట్టిన 'మహా పాదయాత్ర' గ్రామాల సరిహద్దులు దాటుకుంటూ విజయవాడ వరకూ సాగింది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 8 మండలాలు, 222 పంచాయతీలు, 373 గ్రామాలు, 1,06,000 కుటుంబాలు నీట మునుగుతాయి. లక్షల జనాభా నీట మునిగి ఆస్తులు, సంపద పోగొట్టుకుంటున్నా వీరి సంక్షేమాన్ని, పునరావాసాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అత్యంత విషాదం. 2018 డి.పి.ఆర్. ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ. 55.656 కోట్లు. ఇందులో పునరావాసం కోసం ఖర్చు చేయాల్సింది రూ. 33,000 కోట్లు కానీ ఖర్చు చేసింది రూ. 7000 కోట్లు మాత్రమే. ఎక్కువ శాతం నిర్మాణానికే ఖర్చు చేస్తున్నారు. మరి నిర్వాసితుల సంగతేంటి? సర్వస్వం త్యాగం చేసిన గిరిజనులు, అడవి బిడ్డల పరిస్థితి ఏంటి? అందుకే పునరావాసం పూర్తయిన తరువాతే ప్రాజెక్టు కట్టాలి.

పోలవరం ప్రాజెక్టు ద్వారా చాలా ప్రయోజనాలు చేకూరతాయనేది ఎంత వాస్తవమో నిర్వాసితులు నష్టపోతారన్నది అంతే నిజం. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 25 రకాల మౌలిక వసతులు కల్పించాలి. కానీ అవెక్కడా నిర్వాసితుల కాలనీల్లో కనిపించవు. ఏ నిర్వాసిత కాలనీలో కూడా శ్మశానవాటికలు కనిపించవు. బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం నిర్వాసిత కాలనీల్లో అధ్వాన పరిస్థితులున్నాయి. ఇళ్ళ శ్లాబులు వర్షం వస్తే కారిపోతున్నాయి. నిర్మాణ సంస్థలు కాసుల కక్కుర్తితో నాణ్యత లేకుండా నిర్మించాయి. విద్య, వైద్యం సదుపాయాలు లేవు. గడప గడపకు వైసిపి పేరుతో గత కొంత కాలంగా హడావుడి చేస్తున్నారు. కానీ రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, పోలవరం ఎమ్మెల్యే బాలరాజు నిర్వాసిత కాలనీల్లో అడుగు పెట్టడం లేదు. ఈ గడపలకు ఎందుకు రావడం లేదు. నిర్వాసితులు నిలదీస్తారని భయమా?

ప్రతి సంవత్సరం వరద వస్తుంది. 2022 జులై నెలలో వచ్చిన వరద వేరు. ఇది పాలకుల నిర్లక్ష్యం కారణంగా వచ్చిన వరద. కాంటూరు లెక్కలన్నీ తప్పని ఈ వరదలతో తేలిపోయింది. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా వరద ప్రాంతాలను ముంపు ప్రాంతాల జాబితాలోకి చేర్చాలని ప్రజలు కోరుతున్నారు. వరదలో పశువులు కొట్టుకుపోయాయి. పంటపొలాలు మునిగిపోయాయి. 33 రోజులు ఎందరో ఇళ్ళు నానిపోయి పడిపోయాయి. విలువైన వస్తువులు పాడైపోయాయి. ఇంత నష్టం జరిగితే ప్రభుత్వం నుండి అందిన సహాయం రూ.2 వేలు మాత్రమే. ఇళ్ళు కూలిపోయినవారికి రూ.10 వేలు అందించారు. అది కూడా అరకొరగానే అందించారు. అందులోను రేకుల షెడ్డుకి ఇవ్వలేదు. ముంపు గ్రామాల ప్రజల కష్టాలు ఇలా ఉంటే ఊళ్లు ఖాళీ చేసి వచ్చిన నిర్వాసిత కాలనీలో బతుకుతున్న గిరిజనుల పరిస్థితి ఘోరంగా తయారైంది. వారు నిర్వాసిత కాలనీలకు వచ్చి 2 సంవత్సరాలైంది. రావాల్సిన ప్యాకేజీ డబ్బులు ఇంకా రాలేదు. కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. 'చూస్తాం ప్రభుత్వం ప్యాకేజీ డబ్బులు ఇవ్వకుంటే మరలా తిరిగి మా గ్రామాలకు వెళ్ళిపోతాం. పరిహారం ఇస్తుందో, మమ్మల్ని గోదారిలో ముంచేస్తుందో ప్రభుత్వమే తేల్చుకుంటుంద'ని ఆవేదన చెందుతున్నారు.

సాధారణంగా తుఫాన్లు సముద్రాల్లో పుడతాయి. కానీ ప్రభుత్వం నిర్వాసితుల పట్ల ఇదే వైఖరి కొనసాగిస్తే, వదిలేస్తే, ఉదాసీనత ఇలాగే కొనసాగితే తుఫాన్ పుట్టేది సముద్రంలో కాదు. గోదారి నదిలో. ఆ తుఫాన్ పేరు నిర్వాసితుల ఉద్యమం. ఈ తుఫాన్ ప్రజల్ని ఐక్యం చేసి పాలకులను వణికించి అమరావతి దగ్గర తీరం దాటుతుంది జాగ్రత్త. ఇది హెచ్చరిక కాదు. వాస్తవం. గిరిజనులే కదా అణచివేద్దాం, తొక్కేద్దాం అంటే కుదరదు. ఎందుకంటే ఇది చరిత్ర. ఇదే గిరిజనులకు ప్రభుత్వ పెత్తందారులకి జరుగుతున్న అసలైన వర్గపోరాటం. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెలుగు తొలి పత్రిక.. ఆంధ్రపత్రిక

తెలుగులో పూర్తిస్థాయి దినపత్రిక ఆంధ్రపత్రికను స్థాపించి, నిర్వ హించిన కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు చిరకాలం స్మరించు కోదగిన మహనీయుడు.

అంతకుముందు అనేకమంది కొద్దికాలంపాటు చిన్నా పెద్దా పత్రికలు నెలకొల్పి నడిపించి వుండవచ్చు. అవి అంతగా పత్రికా వ్యవస్థలో రాణించలేకపోయాయి. నాగేశ్వరరావు గారు 1908 ఆగస్టు 8వ తేదీన ఆంధ్రపత్రికను తెలుగు వారపత్రికగా స్థాపించారు. ఆయన స్వదేశీ పరిశ్రమలను స్థాపించాలన్న వాంఛతో కలకత్తా, బంబాయివంటి నగరాలను సందర్శించి చివరికి బంబాయిలో అమృతాంజనం పరిశ్రమను నెలకొల్పారు. తెలుగువారిలో స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించాలనే లక్ష్యంతో ఆంధ్రపత్రికను స్థాపించారు. ఆంధ్రపత్రికను 1914 ఏప్రిల్ 1వ తేదీన మద్రాసుకు తరలించి, దానిని దినపత్రికగా వెలువరించారు.

రాజద్రోహం నేరం కింద మూడు సంవత్సరాలపాటు కఠిన కారాగార శిక్ష అనుభవించిన గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారితో మాట్లాడేందుకే కొందరు భయపడే ఆ రోజుల్లో ఆయన్ను 'ఆంధ్రపత్రిక' దినపత్రికకు మొదటి సంపాదకుడిగా నియమించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ యజమాని రామనాథ్ గోయెంకా మద్రాస్‌లో 1938లో తెలుగు దినపత్రికగా 'ఆంధ్రప్రభ'ను స్థాపించేవరకూ తెలుగువారికి ఆంధ్రపత్రిక ఏకైక దినపత్రికగా వెలుగొందింది.

ఆంధ్రపత్రిక ద్వారా తెలుగు ప్రజలను రాజకీయంగానూ, సాంఘికం గానూ చైతన్య పరిచారు. అంతేకాదు. 'భారతి' అనే సాహిత్య పత్రికను కూడా నెలకొల్పి సాహిత్య, సాంస్కృతిక, కళారంగాలను ప్రోత్సహించారు. తన పత్రిక ద్వారా అనేక మంది పాత్రికేయులను, రచయితలను పెంపొందించడానికి సహాయపడ్డారు. దినపత్రికను నిర్వహించడం ఆ రోజుల్లో ఎంతగానో నష్టదాయకమై నప్పటికీ నాగేశ్వరరావుగారు వెనుకాడకుండా ఆంధ్రపత్రికను కొనసాగించారు. తెలుగు ప్రజలకు దినపత్రికను తొలిసారిగా అందించి మహత్తర సేవచేసిన కాశీనాధుని నాగేశ్వరరావుగారు అత్యంత పూజనీయుడనీ, ఆయన ఫొటోను ప్రజాశక్తి కార్యాలయంలో వుంచడం సముచితమని సుందరయ్యగారు సలహా ఇచ్చారంటే ఆయన కృషి పట్ల ఎంతగా గౌరవాభిమానాలున్నాయో గ్రహించవచ్చు. నాగేశ్వరరావుగారు కృష్ణా, ఉభయ గోదావరుల సంయుక్త నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర శాసనసభకు పెద్ద మెజారిటీతో ఎన్నికయ్యారు. విజయవాడలోని ఆయనకు చెందిన దుర్గాభవనం కాంగ్రెస్ కార్యకలాపాలకు నిలయంగా ఉండేది.

ఆర్‌బికెల ద్వారా 8,944 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

ఎడిఎ బుజ్జిబాబు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రైతులంతా రైతుభరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసే ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఎడిఎ పిజి.బుజ్జిబాబు సూచించారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రైతులకు అనువుగా ఉండేందుకు రైతుభరోసా కేంద్రాల్లో అన్నిరకాల ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉంచామన్నారు. కెఆర్‌పురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 111 రైతుభరోసా కేంద్రాల ద్వారా 8,944 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకం సాగించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులందరూ రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నానో యూరియా కూడా అందుబాటులో ఉంటుందని ఎడిఎ బుజ్జిబాబు తెలిపారు.

కొయ్యలగూడెంలో విత్తన పరీక్షా కేంద్రం

కొయ్యలగూడెం మండల కేంద్రంలో రైతులు మేలు రకం విత్తనాలను పరీక్షించుకోవడానికి ప్రభుత్వం ఈ ఏడాది జులై 8న విత్తన పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించిందన్నారు. రైతులు తమ పొలంలో నాటే విత్తనాల నాణ్యతను ముందుగా పరీక్షించుకుని నాటడం ఉత్తమమని సూచించారు. నాసిరకం విత్తనాలను గుర్తించడానికి కొయ్యలగూడెం విత్తన పరీక్షా కేంద్రం ఎంతో దోహదపడుతుందని ఎడిఎ బుజ్జిబాబు తెలిపారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరి 37,872 ఎకరాల్లో, మొక్కజొన్న 1295 ఎకరాలు, చెరకు 4093 ఎకరాల, పత్తి 7281 ఎకరాల్లో సాగవుతున్నాయని వివరించారు. ఎనిమిది మంది వ్యవసాయాధికారులు, 114 మంది సిబ్బందితో రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నట్లు ఎడిఎ బుజ్జిబాబు తెలిపారు. రైతులంతా తాము పండించే పంట వివరాలను ఇ-పంటలో నమోదు చేసుకుని ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను పొందాలని ఎడిఎ బుజ్జిబాబు విజ్ఞప్తి చేశారు.